విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

శుక్రవారం 19 సెప్టెంబరు 2025 8 పేజీలు

అసెంబ్లీ సమావేశాలకు

పటిష్ఠ బందోబస్తు

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని బందోబస్తుకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే వీవీఐపీ, వీఐపీ, మీడియా, సందర్శకులు ప్రవేశించే 1, 2, 3, 4 గేట్లను పరిశీలించి, నిర్ణీత వ్యక్తులను మాత్రమే సదరు గేట్ల నుంచి అనుమతించాలని, అందరితో మర్యాదపూర్వకంగా, వినయంతో మెలగాలని సూచించారు. వీవీఐపీలు ఇతరుల వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన ప్రదేశంలో మాత్రమే వాటిని పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ(ఎల్ అండ్ ఓ) ఏటీవీ రవికుమార్, తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాస్ ఉన్నారు. రాయపూడి, మల్కాపురం, మందడంలో పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు.

బార్ల కేటాయింపునకు

దరఖాస్తులు కరువు

జిల్లాలో ఆగిపోయిన 54 బార్లు

మూడు విడతల లాటరీలో 140బార్లు కేటాయింపు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా బార్లు తీసుకునేందుకు దరఖాస్తులుదారులు ముందుకు ఆసక్తి చూపడంలేదు. ఆచరణ సాధ్యంకాని పాలసీని ప్రభుత్వం తీసుకురావడంతో బార్లను నిర్వహించడం సాధ్యంకాదని,ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉన్నందుకు దరఖాస్తు చేసుకోలేదని పలువురు లైసెన్స్‌దారులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం షాపులను నిర్వహించడం, మందు బాబులకు అవసరమైన బ్రాండులు అందుబాటులో లేకపోవడం మరియు పర్మిట్ రూమ్స్ లేకపోవడంతో బార్ల వ్యాపారం బాగుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నూతన పాలసీతో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకే విక్రయించడం పాటు పర్మిట్ రూమ్‌లకు అవకాశం కల్పించడంతో బార్‌లకు పెద్దగా వ్యాపారం జరిగే అవకాశంలేదని మద్యం వ్యాపారులు భావిస్తున్నారు. ఈ కారణంగా నూతన బార్లు తీసుకునేందుకు లైసెన్సుదారులు అంతగా ఆసక్తి చూపడంలేదని తెలిసింది. నూతన పాలసీలో బాగంగా మూడేళ్ల కాలపరిమితికి గాను ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ కేటగిరీ విభాగంలో 130 బార్లు, గీతకార్మికులకు ప్రత్యేకంగా 10 బార్లు కేటాయించడం జరిగింది. తొలి విడత నోటిఫికేషన్ లో భాగంగా ఓపెన్ కేటగిరీలో 69 బార్లు, గీత కులాలవారికి కేటాయించిన 10 బార్లు మొత్తం 79 బార్ల కేటాయింపు పూర్తి అయ్యింది. ఎన్టీఆర్ జిల్లాలో ఓపెన్ కేటగిరీలో మిగిలిపోయిన 61 బార్ల కేటాయింపునకు ఈ నెల 3వ తేదీన మళ్ళీ గెజిట్ నోటిఫికేషన్ -మిగతా 2 లో ...

వైసీపీ ప్రణాళికలతో సమస్యలు

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

విశాలాంధ్ర-మంగళగిరి : వెస్ట్ బైపాస్ వంతెనను సంక్రాంతి నాటికి అందుబాటులోకి తీసుకురాబోతున్నాం, అయితే వైసీపీ ప్రభుత్వం అవలంభించిన ప్లానింగ్ లేని ప్రణాళికలతో గుంటూరు టు విజయవాడ వెళ్ళే ప్రయాణికులకు కొంత ప్రయాణ దూరం పెరుగుతుంది. స్థానికులకు ఇబ్బంది లేకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్, విశాఖపట్నం కనెక్టివిటీకి ఉపయోగపడే వెస్ట్ బైపాస్‌ను పెమ్మసాని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నిర్మాణాలు, పెండింగ్ పనులు, అండర్ పాస్ వర్కులు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా గుంటూరు విజయవాడ మీదుగా వెళ్లే ప్రయాణికులకు హాయ్ ల్యాండ్ సమీపంలోని అండర్ పాస్ నుంచి యూ టర్న్ తీసుకుని జాతీయ రహదారి గుండా వెళ్లాల్సి -మిగతా 2 లో ...

కూచిపూడి అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర, కూచిపూడి : ప్రపంచ ప్రసిద్ధిచెందిన కూచిపూడి నాట్య కేంద్రం కూచిపూడి గ్రామాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో డిఆర్ఓ కే చంద్రశేఖరరావుతో కలిసి కూచిపూడి గ్రామ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామీణ స్వచ్ఛ అభియాన్ కింద కూచిపూడిలోని ఆయా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని, ప్రతిపాదించిన పనులకు అంచనాలు తయారు చేసి సమర్పించాలన్నారు. పామర్రు నుంచి కూచిపూడి, కళాక్షేత్రం యూనివర్సిటీకి చేరుకునే ఐలూరు రహదారుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాల న్నారు. గ్రామంలోని డ్రైనేజీ మరమ్మతులను చేపట్టాలని అందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తామన్నారు. రెగ్యులర్ నృత్య కోర్సులతో పాటు -మిగతా 2 లో ...

పల్నాడు జిల్లాకు జాషువా పేరు సముచితం

అట్లూరి విజయ్‌కుమార్, మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ : తెలుగు సాహిత్యాన్ని సామాజిక చైతన్యం వైపు నడిపించిన విశ్వకవి గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టడం ఎంతైనా సముచితమని గుర్రం జాషువా గుంటూరు, పల్నాడు జిల్లా సాధన సమితి కన్వీనర్ అట్లూరి విజయకుమార్ అన్నారు. వినుకొండలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతివరప్రసాద్ మాట్లాడుతూ. జాషువా ఒక ప్రాంతానికో ఒక రాష్ట్రానికో పరిమితమైన కవి కాదని, దేశం గర్వించదగ్గ జాతీయ కవీశ్వరుడు జాషువా అని, దక్షిణ భారత దేశంలో సుబ్రమణ్య భారతి వలె, ఉత్తర భారత దేశంలో ఠాగూర్ మరియు మైథిలి శరణ్ గుప్తా వలె జాషువా కూడా సర్వ మానవ సమానత్వాన్ని కోరుకొని మనిషి కేంద్ర బిందువుగా చేసుకొని తన రచనలన్నింటినీ -మిగతా 2 లో ...

దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట

- 15 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- శాంతి, సౌభ్రాతృత్వంతో జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదాం
- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

2

(మొదటి పేజీ తరువాయి)

బార్ల కేటాయింపునకు దరఖాస్తులు కరువు

విడుదల చేయడం జరిగింది. గడువు ముగిసే సమయానికి 17వ తేదీ ఓపెన్ కేటగిరీలో ప్రకటించిన 61 బార్లకుగాను 7 బార్లకు మాత్రమే మొత్తం 28 దరఖాస్తులు వచ్చాయి. 54 బార్లకు ఒక్క అప్లికేషన్ కూడా రాలేదు. వీటిలో నిబంధనల ప్రకారం కనీసం 4 దరఖాస్తులు వచ్చిన 7 బార్ల కేటాయింపు ప్రక్రియ ముందే ప్రకటించిన విధంగా గురువారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో దరఖాస్తుదారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ లాటరీ పద్ధతిలో పారదర్శకంగా బార్లు కేటాయించారు.. రెండవ విడత నోటిఫికేషన్ ద్వారా బార్ల కేటాయింపు పూర్తయిన తరువాత ఇంకా 54 బార్లు దరఖాస్తులు రాని కారణంగా ఆగిపోయాయి. తిరువూరు నగర పంచాయతీ పరిధిలో ఒక బారు, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో ఒక బారు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు బార్లు మరియు విజయవాడ నగర పరిధిలోని 46 బార్లు మిగిలిపోయిన వాటిలో ఉన్నాయి. బార్లు పొందిన లైసెన్సుదారులు ప్రభుత్వం నిర్ణయించిన లైసెన్సు ఫీజులో 6వ వంతు సొమ్ము 18వ తేదీన చలానా రూపంలో చెల్లించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రణాళికలతో సమస్యలు

ఉంటుంది. 2014-19 సమయంలో టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణాన్ని వైసీపీ వచ్చాక పూర్తిగా గాడి తప్పింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధమవుతున్న ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా ఈ సమస్యకు పరిష్కారం అందించబోతున్నాం. అలాగే ఈ అండర్ పాస్ వద్దగల స్థానికులకు ప్రయాణ రాకపోకలకు ఇబ్బంది లేకుండా రూ.2 కోట్ల నిధులతో ఫుట్ బ్రిడ్జి ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించాం. కాగా డిసెంబర్ చివరికి నిర్మాణం పూర్తి చేసి సంక్రాంతి కల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం పనులన్నీ సజావుగా సాగుతున్నాయని పెమ్మసాని తెలిపారు. ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి అభివృద్ధికి చర్యలు

సెలవుల్లో రోజుల్లో వారాలు, నెలల షార్ట్ కోర్సులు నిర్వహించే విధంగా చూడాలని, తద్వారా ఎక్కువ మందిని ఆకర్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో కూచిపూడి నృత్యం నేర్చుకుని ఉన్నత స్థానంలో ఉన్న ప్రముఖులను గుర్తించి కళాక్షేత్రం అభివృద్ధికి సహకారం కోరాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.అదేవిధంగా కూచిపూడి గ్రామంలో మహిళలు తయారు చేసిన కూచిపూడి నృత్య దుస్తులు, జడలు, గజ్జలు తదితర వస్తువులకుమార్కెటింగ్ సౌకర్యం కల్పించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం(శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠం)కు ఉపకులపతిని నియమించాలని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులను కోరారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ కెపాసిటీ బిల్డింగ్ ఏడి లజవంతి నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామ లక్ష్మణరావు, కన్సల్టెంట్ సాహితి, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, మొవ్వ ఎంపీడీవో డి సుహాసిని, తహసీల్దారు.కె.మస్తాన్, కూచిపూడి సర్పంచ్ భర్త కొండవీటి అమరబాలేశ్వరరావు, గ్రామ తెలుగుదేశం అధ్యక్షుడు వెంపటి గోపాలకృష్ణ, వీఆర్వో ఎం ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాకు జాషువా పేరు సముచితం

కొనసాగించి చరిత్రలో పల్నాడుకు సరికొత్త వైభవాన్ని అందించిన మహాకవి, మనకవి జాషువా అని, ఈ విషయంపై 22 చిలకలూరిపేటలో, 25 మాచర్ల, గురజాల నియోజకవర్గాలలో కుల మత ప్రాంత రాజకీయాలకు అతీతంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, అనంతరం జాషువా జయంతిని పురస్కరించుకొని, జాషువా పుట్టిన గడ్డ చాట్రగడ్డపాడు నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి వరకు పాదయాత్ర చేపడతామని,ఈ సందర్భంగా ఆయా స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను అందజేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో సుదీర్ఘ అనుభవం కలిగిన గుర్రం జాషువా కళాక్షేత్ర అధ్యక్షులు, కాంస్య విగ్రహ దాత, పోరాట యోధుడు జాన్ సుందర్, సీనియర్ అడ్వకేట్ వంకాయలపాటి రవి, సిపిఎం అధ్యక్షులు వంగూరి వెంకటేశ్వర్లు, టిడిపి అధ్యక్షులు దాసయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు పమిడిపల్లి ఇశ్రాయేలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, జనసేన నాయకులు, పిడిఎం నాయకులు, ముస్లిం మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగూర్ భాషా , ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ ఇర్ఫాన్, షేక్ బాజీ తదితరులు పాల్గొని మాట్లాడుతూ.. జాషువా ఏది చేసినా ఏది రాసినా ఒక్క ప్రాంతానికో ఒక మతానికో పరిమితమైన రచనలు చేయలేదని, దేశ ప్రజల బాధలే తన బాధలుగా భావించి సర్వ మానవ సౌభ్రాతృత్వం మానవత్వపు పరిమళాలు ఈ నేలపై పరిఢవిల్లాలని కోరుకున్నాడని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట

విశాలాంధ్ర-విజయవాడ: దసరా ఉత్సవాలకు సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ, నగర పోలీస్ కమిషన్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకుంటున్నామని, జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని పేర్కొన్నారు. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేందుకు అవకాశముందని తెలిపారు. ఉత్సవాలను జరుపుకుం టామని ఇలాంటి వాతావరణానికి ఇబ్బంది కలిగించాలని ప్రయత్నించే వారిపై డేగ కన్ను ఉంటుందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా ఇలా ప్రతివిషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎండబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు తదితరులు హాజరయ్యారు.

దుర్గమ్మ ఉత్సవాల విశిష్టతకు భంగం కలిగించేలా చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ: కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల విశిష్టతకు భంగం కలిగించేలా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నా రని వైఎస్సీపీనేతలు మండిపడ్డారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు పేర్ని వెంకట్రామయ్య (నాని), వెల్లంపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ నవరాత్రి అమ్మవారి ఉత్సవాల ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేసేలా తెలుగుదేశం ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో

విజయవాడ ఉత్సవ్ పేరుతో కమర్షియల్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలనుకునే ఆలోచన లను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి 29, 2007లో 5.30 ఎకరాల భూమికి దేవాదాయశాఖ వేలం నిర్వహిస్తే, అందులో 135 మంది రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఈ వేలంలో సగం టీడీపీ వారే పాల్గొన్నారు. లిస్టులో 30వ పేరు మంత్రి కొల్లు రవీంద్రకి అప్పుడు పల్లపాటి సుబ్రహ్మణ్యం ఉన్నాడు. నందిగామలో ఐదు రీచ్‌లు మూసేసి రెండింటిలోనే విచ్చలవిడిగా ఇసుక తోడేస్తున్నారని, అన్నారు. ఒక్క నందిగామ నియోజకవర్గం నుంచే రోజూ వందలాది లారీ హైదరాబాద్‌కి తరలిస్తున్నారు. అక్కడ సాయి అనే వ్యక్తి ద్వారా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

హైకోర్టు ఉత్తర్వులను తీవ్రంగా ఖండించిన న్యాయవాదులు

విశాలాంధ్ర-విజయవాడ: మరణించిన న్యాయవాదికి నివాళులు అర్పించే సమయాన్ని మారుస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును బార్ అసో సియేషన్ న్యాయవాదులు తీవ్రంగా తప్పుబట్టారు. బార్ అసోసియేషన్ పిలుపు మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లా న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరిస్తు

పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ది బెజవాడ బార్ అసోసియేషన్‌లో అంతకుముందు మరణించిన ఐదుగురు న్యాయవాదులకు 10.30 గంటలకు రిఫరెన్స్ నిర్వహించారు. ఈ రిఫరెన్సో బార్ అసోసియేషన్ సభ్యులందరూ హైకోర్టు ఉత్తర్వులను ముక్త కంఠంతో ఖండించారు. అనంతరం ఏకే భాషా మాట్లాడుతూ గతంలో దురదృష్టవశాత్తు మరణించిన న్యాయవాదిని ఉన్నత కోర్టు జడ్జి సమక్షంలో 10.30 నుండి 12 గంటల వరకు రిఫరెన్స్ నిర్వహించుకుం టూ మరణించిన న్యాయవాదిన స్మరించుకుంటూ నివాళులు అర్పించేవారని తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు రిఫరెన్స్ నిర్వహించుకోమని హైకోర్టు తీర్పు ఇవ్వడం బాధకరమన్నారు. సాయంత్రం సమయంలో న్యాయవాదులు అందుబాటు లో ఉండరని, ఆ సమయంలో అందరు న్యాయవాదులు కోర్టులోనే ఉంటారని కోర్టు ఉత్తర్వులు అనుసరించడం కింద కోర్టులలో సాధ్యపడవని స్పష్టం చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాల కొరకు రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వెనకబడిన న్యాయవాదుల కోసం పర్మనెంట్ ఫండ్ ఏర్పాటు చేయటం కోసం కార్యాచరణకు తీర్మానం చేస్తున్నాము అని ప్రకటించారు. బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్య వైద్యం దూరం చేయాలనే

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలు పిపిపి పేరుతో ప్రైవేటీకరణపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లడం గర్హనీయమన్నారు అని జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపకులు,హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ దుయ్యబట్టారు. జై భీమ్ రావు భారత్ పార్టీ అధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం ధర్నాచౌక్‌లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జడ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదో తరగతి చదివిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి డాక్టర్ విలువ ఏమి తెలుస్తుందనీ జడ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం రాష్ట్ర చరిత్రలో లేదన్నారు.ప్రజలకు వైద్యం, విద్య దూరం చేయాలనే.. ఆలోచన ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీ కరణ ఉద్దేశమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు,వైసిపి నాయకురాలు, మాజీ మంత్రి విడుదల రజిని మాట్లాడుతూ వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని, తద్వారా అభివృద్ధికి, పేద, ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు, మహిళలకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్,జై భీమ్ రావు భారత్ పార్టీ నేతలు పరస సురేష్, కొండలరావు, జగ్గవరపు మల్లికార్జున నేతలు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.17 కోట్లు

235 గ్రాముల బంగారం, 3.970 గ్రాముల వెండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై గత 14రోజులు కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. రూ.2,17,98,528 నగదు, 235 గ్రాముల బంగారం, 1.39 గ్రాముల వెండీ కానుకలుగా వచ్చాయని ఆలయ ఈవో శీనా నాయక్ తెలిపారు. 321 యుఎస్ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 25 యూఏఈ దిర్హమ్స్, 25 సౌదీ రియల్స్, 200 ఒమన్ బైసా కరెన్సీతో పాటు ఖతార్, మలేషియా, యూరోప్, కువైట్, హాంగ్‌కాంగ్, థాయిలాండ్, బహ్రెయిన్ దేశాల విదేశీ కరెన్సీ ఇంద్రకీలాద్రి పై ఉన్న 48 హుండీలలో భక్తులు ఇచ్చిన కానుకలుగా వచ్చాయన్నారు.

వెస్ట్ బైపాస్ వినియోగంపై పరిశీలన

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): వెస్ట్ బైపాస్ వినిమోగం పై నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశా అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల నేపథ్యంలో వాహనదారుల సౌలభ్యం కోసం వెస్ట్ బైపాస్ ప్రాంతాన్ని పరిశీలించారు. వాహనదారుల ప్రయాణాల సౌకర్యం పై చర్చించి, అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు 15లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉన్నట్లు, సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పొటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఎన్నడూ లేనివిధంగా విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. పార్కింగ్ ప్రదేశాలు, కుమ్మరిపాలెం నుండి దుర్గాఘాట్ వరకు క్యూలైన్లు, దుర్గాఘాట్ నుండి మహామండపం, కనకదుర్గా నగర్, రథం సెంటర్, వినాయక గుడి, సీతమ్మ వారి పాదాలు, తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ తిరుమలేశ్వర రెడ్డి, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఏసీపీ దుర్గారావు, సీఐలు పాల్గొన్నారు.

కలెక్టర్ బాలాజీని కలిసిన డీడీఎల్ఓ సునీత శర్మ

విశాలాంధ్ర మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ డీకె.బాలాజీని గురువారం గుడివాడ డివిజనల్ డెపలప్‌మెంట్ ఆఫీసర్ సునీత శర్మ మర్యాద పూర్వకంగా కలిసారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపిడీఓగా పనిచేస్తున్న సునీత శర్మ పదోన్నతిపై గుడివాడ డిడిఓగా గుడివాడ వచ్చారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర మచిలీపట్నం : మచిలీపట్నంలో వివిధ సమస్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరా కు కృష్ణ జిల్లా బీ.సీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం గురువారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం సుబ్రమణ్యం మాట్లాడుతూ నాణ్యతలేని పసుపు రంగు ఎల్.ఈ.డి వీధి దీపాలు అమర్చడంతో మచిలీపట్నం వీధులు కాంతి విహీనంగా మారాయి అన్నారు. చలానాలు వసూలు చేసి ముందుగానే మాధ్యమాల ద్వారా ఏ రోడ్డు మూసివేయడం జరుగుతుందో ప్రజలకు తెలియజేసి ఇబ్బందిని తొలగించాలని సుబ్రమణ్యం ఈ సందర్భంగా కోరారు. పైన పేర్కొన్న అంశాల పై తగు చర్యలు తక్షణమే తీసుకోవాలని కమిషనర్ బాపిరాజుకు బీ.సీ సంక్షేమ సంఘం తరఫున వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జన్ను గోవిందు, బోగిరెడ్డి సుభాని, అన్సారి, పి. సాంబశివరావు, ఎం. రామ రాజు, పవన్, తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన గురించి పూర్తిగా తెలుసు

విశాలాంధ్ర-విస్సన్నపేట : ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలన ఎలా ఉంటుందన్న విషయం తనకు బాగా తెలుసని, ప్రజలే తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే, తిరువూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాస్ అన్నారు. మండలంలోని తాతకుంట్ల గ్రామంలో గురువారం జరిగిన ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి తాణంకి రాంబాబు అభినందన సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు పాలనలో ప్రజా సంక్షేమం ఏ స్థాయిలో ఉంటుందో, ప్రస్తుతం సాగుతున్న అబద్ధపు పాలన నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి మృతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు కిందపడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మధురానగర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ 1 చివర వెస్ట్‌సైడ్ వద్ద ఉన్న రైల్వేట్రాక్ వద్ద సుమారు 60 సం.లు ఉన్న వ్యక్తి గురువారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు మనికట్టు వద్ద బ్లేడ్‌తో కోసుకున్నాడు. మృతుడు ఎత్తు 5 అడుగులతో ఎరుపు రంగు కలిగి ఉన్నాడు. శరీరంపై కాకి రంగు నిక్కర్ పై గళ్ళ లుంగీ ,బ్రౌన్ క్రీమ్ కలర్ కలసిన షర్టు ధరించి ఉన్నాడు.షర్టు కాలర్‌పై టైమెక్స్ టైలర్ ఎస్ఆర్ పురం, విజయవాడ అనే లేబుల్ ఉంది.అంతకుమించి వివరాలు లభ్యం కాలేదు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిస్తే విజయవాడ రైల్వే పోలీస్ స్టేషన్లో 94406 27544, 8247897953లో సంప్రదించాలని ఆయన కోరారు.

పోర్టులో పచ్చదనానికి : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : పోర్టు ప్రాంతంలోని 266 ఎకరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినప్పటికి ఎటువంటి చర్యలు ఇప్పటివరకు తీసుకోలేదని కలెక్టర్ డీకె. బాలాజీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన చాంబర్‌లో ఏపి మారీటైం బోర్డు, మెగా సంస్థ, రైట్స్, మున్సిపల్, అటవీ శాఖ అధికారులతో గురువారం మచిలీపట్నం పోర్టు గ్రీన్ యాక్షన్ ప్లాన్ కు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లా అటవీ శాఖ అధికారిణి సునీత, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఏపి మారిటైం బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనులు నిరంతరాయంగా చేయాలి

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని ఔటఫాల్ డ్రెయిన్స్‌లో డీసిల్టింగ్ పనులు నిరంతరాయంగా జరుగుతుండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగర పర్యటనలో భాగంగా స్థానిక వన్‌టౌన్ తారాపేట, బిఆర్‌పి రోడ్, నెహ్రూ రోడ్, పాడివీధి ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ ఫాల్ డ్రెయిన్స్‌లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పని చేస్తూ వ్యర్థాలను తొలగిస్తూ డీసిల్టింగ్ చేస్తూ ఉండాలన్నారు. వ్యర్థాలు తొలగించే ప్రక్రియలో మెషిన్లను పూర్తిస్థాయిలో ఉపయోగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో

పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సచివాలయంలో త్రిపుల్ఆర్ కేంద్రం

స్వచ్ఛోత్సవ, స్వచ్ఛత ఈ సేవ 2025లో భాగంగా ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీ యూస్, రీసైకిల్) కేంద్రం ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. స్థానిక రాఘవయ్య పార్క్ వద్ద ఏర్పాటు చేసిన త్రిపుల్ ఆర్ సెంటర్‌ను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 64 వార్డుల్లో 64 మరియు 9 ప్రత్యేకమైన ఆర్ఆర్ఆర్ కేంద్రాలున్నాయని, ప్రస్తుతం ప్రతి సచివాలయంలో కూడా ఒక త్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రజలు ఆ కేంద్రం వద్దకు వచ్చి, వారికి అవసరం లేని స్టీల్ పాత్రలు, వస్త్రాలు, పుస్తకాలు, కాగితాలు, చెప్పులు, షూలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా సామాగ్రిని అందించవచ్చన్నారు. తద్వారా వ్యర్థాలను రెడ్యూస్ అంటే తగ్గించడం, రియూస్ అంటే మళ్ళీ వాడటం, రీసైకిల్ అంటే పునరుద్ధరించే చర్యలు అధికారులు తీసుకుంటారని తెలిపారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సంతానం

విశాలాంధ్ర-కృత్తివెన్ను : గర్భిణీ స్త్రీలు ప్రతి నిత్యం పోషక ఆహారం తీసుకోవడంతోనే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని సిడిపిఓ సముద్రవేణి అన్నారు. గురువారం నిడమర్రు గ్రామపంచాయతీ, ఓర్లగొందితిప్ప అంగన్వాడి సెంటర్ లో పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబరు 16వ తేదీ వరకు పోషణ మహా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. చంటి పిల్లలకు చక్కెర, నూనె వస్తువులు ఎక్కువగా తినిపిస్తే ఊబకాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పెరట్లో పండించే ఆకుకూరలు, చిరుధాన్యాలను గర్భిణీ స్త్రీలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఝాన్సీరాణి, అంగన్వాడి కార్యకర్తలు బి పద్మశ్రీ, జె యేసురత్నం, ఆశా కార్యకర్త బి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గన్నవరం : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం డిమాండ్ చేశారు గురువారం రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు గన్నవరం ఎమ్మార్వో కార్యాలయంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బొడ్డు వెంకటరత్నం మాట్లాడుతూ సహాయకులు గా పనిచేస్తున్న మేము చాలీచాలని జీతాలతో అసలే నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి మోయలేని భారాలతో జీవనం సాగిస్తున్నామని ఒక్క పూట గడవడం లేదని అన్నారు. అర్హత కలిగిన సహాయకులను వీఆర్వోలుగా ప్రమోట్ చేయాలనే అలాగే పని భారం తగ్గించి ఆఫీసులో కంప్యూటర్ వర్క్ గానూ నైట్ వాచ్మేన్ గాను పనిచేస్తున్నారని పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సహాయకులకు పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎం పూర్ణచంద్రరావు జి రామకృష్ణ అనుష్క మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు

104తో 107 మందికి పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం అయ్యంకి శివారు కారకంపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన 104 సంచార వైద్యశాల సేవల లో భాగంగా "స్వస్థనారిసశక్త్ పరివార్ అభియాన్" ద్వారా 107 రోగులకు విజయకుమార్, (నిడుమోలు) ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఎం భగవాన్(మొవ్వ), వైద్యాధికారిణిడాక్టర్ సిహెచ్ రాజేశ్వరి(మొవ్వ) వివిధ రకాల పరీక్షలను నిర్వహించి పలు సూచనలను ఇచ్చి మందులను ఉచితంగా పంపిణీ చేశారు వీరికి పీ.హెచ్.ఎన్.డి శ్రీలక్ష్మి, సిహెచ్ .వో.లు కే దివ్య, సంధ్య దీపిక, కమల, ఆరోగ్య కార్యకర్త (కూచిపూడి) కే రామాంజనేయులు, డీఈవో (104) శివ లీల, ఆశ వర్కర్స్ సహకరించారు.

ఉబకాయం రాకుండా జాగ్రత్త పడాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఊబకాయం సమస్య పెద్ద వారి నుంచి చిన్న పిల్లలు వరకు వేధిస్తోందని,సమస్య రాకుండానే జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి ఉష అన్నారు.హనుమంతపురం లో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జంక్ ఫుడ్ కాకుండా చిరుధాన్యాలు తో తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.టి.వి.లు , సెల్ఫోన్ లు చూస్తూ ఆహారం తీసుకోకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ భారత్ స్టేషన్'తో ప్రయాణికులకు అత్యున్నత సౌకర్యాలు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : అమృత్ భారత్ స్టేషన్ పథకం వంటి కార్యక్రమాల కింద ప్రయాణికులకు అత్యున్నతమైన సౌకర్యాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నమని ఆ పథకం పేరుతో జరుగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) మోహిత్ సోనాకియా సూచించారు. గురువారం డిఆర్ఎం మచిలీపట్నం, గుడివాడ, భీమవరం టౌన్,నరసాపూర్ రైల్వే స్టేషన్లను విస్తృతంగా తనిఖీ చేశారు.మచిలీపట్నం స్టేషన్‌లో వెంట్రప్రగడ వద్ద లెవెల్ క్రాసింగ్ గేట్‌ను పరిశీలించి, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పనుల పురోగతిని సమీక్షించారు.రన్నింగ్ రూమ్ మరియు కోచింగ్ డిపో అక్కడ స్వచ్ఛతా హీ సేవా 2025 ప్రచారానికి అనుకూలంగా పరిశుభ్రత నిర్వహణ యొక్క ఉన్నత ప్రమాణాలను దృష్టి సారించాలన్నారు.గుడివాడ స్టేషన్‌లో తనిఖీ సందర్భంగా ప్రయాణీకుల సౌకర్యాలను పెంచడానికి అనేక సూచనలు చేశారు. ప్రీమియం వెయిటింగ్ హాళ్ల అప్‌గ్రేడ్, మాడ్యులర్ టాయిలెట్ల సంస్థాపన, స్టేషన్ ముఖభాగానికి సౌందర్య మెరుగుదలలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఒబి) నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు అనంతరం నరసాపూర్-నిడదవోలు సెక్షన్ వెనుక విండో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యం, పరిశుభ్రత, భద్రత మా ప్రధాన ప్రాధాన్యతలు ఇస్తున్నామన్నారు.అమృత్ భారత్ స్టేషన్ పథకం వంటి కార్యక్రమాల కింద నిరంతర తనిఖీలు,మౌలిక సదుపాయాల మెరుగుదలల ద్వారా, విజయవాడ డివిజన్ స్టేషన్లను ఆధునిక, ప్రపంచ స్థాయి సౌకర్యాలుగా మార్చడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు.ప్రతి ప్రయాణీకుడికి సజావుగా,ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. డిఆర్ఎం వెంట అధికారులు పాల్గొన్నారు.

JAGGAIAHPET MUNICIPALITY

EXPRESION OF INTEREST

Roc. No.1240/2025/E1 **Dt:18-09-2025**

Sri Chairperson Inanticipation Order, Dt:08-09-2025.

Jaggaiahpet Municipality invites Expression of Interest (EoI) for Third party Quality Assurance Agency for conducting quality control test in Jaggayyapet Municipality for the period of three years from the reputed consultancy who have relevant experience in Quality control services.

The Application for EoI document may be obtained from Commissioner, Jaggayyapet Municipality Cell No.9849905823, 9849907979 during the office hours from **19.09.2025 to 26.09.2025 up to 2.00 PM on payment of Rs.5000/-**, DD in favour of Commissioner, Jaggayyapet Municipality, NTR District and Tender Schedule of **Rs.1000/-** (non-refundable)

The Last date for submission of EoI document along with the details of **26.09.2025 up to 2.00 PM** and Opening of Bids on **26.09.2025 @ 3.00 PM.**

Sd/ **D.T.V.Krishna Rao,** Commissioner, Jaggaiahpet Municipality.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : 2014కు ముందు కాంట్రాక్టు లెక్చరర్లుగా విధులలో చేరిన ఉద్యోగులను, లెక్చరర్ లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు 114 జీవొ ప్రకారం యాక్ట్ 39 ప్రకారం ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనసాగించాలని ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ధర్నా చౌక్ లో ఇంటర్, పాలిటెక్నిక్, ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ ఆంధ్రప్రదేశ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 36 గంటల ఆవేదన దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ శాఖలలో 2014 ముందు కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న 11 వేల మంది ఉద్యోగులను గత ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు జీవో నెంబర్ 114 ద్వారా విధివిధానాలు ప్రకటించి మూడువేల మందిని శాశ్వత ఉద్యోగులుగా

గుర్తించిందని పేర్కొన్నారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, పంచాయతీరాజ్,కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఏపీ వైద్య విధాన పరిషత్తులు లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ప్రభుత్వ నిబంధనగా అనుగుణంగా ఉన్నారు కాబట్టి రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి డివి రమణ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఏదైనా ఒక సమస్యను పరిష్కరించాలని లక్ష్యం పెట్టుకుంటే ఆ సమస్యలో నిజాయితీ ఉందా లేదా అని మాత్రమే పరిశీలిస్తారన్నారు. మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ కాంట్రాక్టు ఉద్యోగు లతో కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. అవసర మైతే జేఏసీ తరపున కూడా ఆందోళన కార్యక్రమాలకు కూడా పిలుపు నిస్తామన్నారు. ఈ ధర్నాలో ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. జగదీశ్వర రావు, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి బి.జె. గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు వై. జాన్ బాబు, ప్రధాన కార్యదర్శి జి.ఎల్. మాణిక్యం, డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి రాజు, క్యాపిటల్ సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు సివిఆర్ ప్రసాద్ తదితరులతో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : నగరంలో కొన్ని రోజులుగా ట్రాన్స్ జెండర్స్ పై మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని హిజ్రా హక్కుల సంఘం సభ్యురాలు నవ్య వెల్లడించారు. ఎవరో ఒకరు చేసిన తప్పిదానికి ట్రాన్స్ జెండర్ అందరికి సమాజంలో చెడ్డ పేరు వచ్చేలా ప్రచారం జరుగుతుందని తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిపురం ఏరియా పరిధిలో ట్రాన్స్ జెండర్ దమయంతి (డానియల్) అనే వ్యక్తి తన బంధువుల మధ్య వచ్చిన వివాదం లో అసభ్యకరంగా ప్రవర్తించినందుకుగాను ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనకు మాకు ఏ విధమైన సంబంధం లేదన్నారు. అసత్య ఆరోపణలు చేయడం సరైన చర్యలు కాదని ఈ విషయమై అధికారులు అందరికీ వినతి పత్రాలు అందజేస్తామన్నారు ఇలాంటి అసత్య ప్రచారాలు చేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటిని శుద్ధి విధానంపై అవగాహన

విశాలాంధ్ర-పెడన : క్షేత్ర పర్యటనలో భాగంగా విశ్వ భారతి విద్యార్థులు స్థానిక 16 వార్డులో ఉన్న వాటర్ పంప్ హౌస్, నీటిని శుద్ధి చేయు విధానాన్ని, పరిశుభ్రమైన నీరు పట్టణ ప్రజలకు అందించు ప్రక్రియను విద్యార్థులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో 8 9 10 తరగతుల విద్యార్థులు ప్రిన్సిపాల్ ఏ. గౌరీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఆర్. ధనలక్ష్మి, పి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

ఉద్యాన వన పంటల సాగు కు రాయితీ

విశాలాంధ్ర -పమిడిముక్కల: మండలంలో ఉద్యాన వన పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని ఉద్యాన వన డిడిహేచ్ జ్యోతి తెలిపారు. అగినపర్రు రైతు సేవా కేంద్రంలో ఉద్యాన పంటల పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు .ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కురకాయలు సాగు చేసే రైతులకు హేక్టారు కి రూ.24 వేలు, పూలు సాగు చేసే వారికి హేక్టారుకి రూ.20 వేలు పాత తోటలు పునరుద్ధరణ కి ఖర్చులో 40 శాతం అలాగే మామిడి తోట ఎకరానికి రూ.24000లు రాయితీ ఇస్తారని తెలిపారు. అయిల్ పామ్ పథకం లో మొక్కలు కొనుగోలు పై 100శాతం రాయితీ ని ఒక హేక్టారు దేశావాళి మొక్కలు కి రూ.20 వేలు, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలకు రూ.29000లు రాయితీ ఇస్తారని తెలిపారు. అయిల్ పామ్ వేసిన రైతులకు మొదటి నాలుగు సంవత్సరాలు ప్రధాన మరియు అంతర పంటలకు రూ.21 వేలు ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు.గన్నవరం ఎడి సునీల్ మాట్లాడుతూ వరి చెలల్లో సామూహిక ఎలుకలు నివారణ కు ప్రభుత్వం వంద శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఓ గణేష్ రెడ్డి సర్పంచ్ కోట మణిరాజ్ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుడివాడ : మున్సిపల్ సిబ్బంది రూపొందించిన పురపాలక సంఘ లోగోను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మున్సిపల్ అధికారులతో కలిసి పురపాలక సంఘ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ 1937లో ఆవిర్భవించిన పురాతనమైన గుడివాడ పురపాలక సంఘానికి నేటి వరకు లోగో లేకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, ఎం.ఈ ప్రసాద్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ ఏసుబాబు, డి.ఈ శివాజీ, ఏఈ రాజేష్, ఎకౌంట్స్ ఆఫీసర్ జిటి నాయుడు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఉబకాయంపై చర్చలు

విశాలాంధ్ర -కూచిపూడి : మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కూచిపూడి సెక్టార్ లోని కొండవరం, కూచిపూడి-4 కేంద్రం, భట్లపెనుమర్రు అంగన్వాడీ కేంద్రాలలో నెలరోజులు నిర్వహించే పోషక ఆహార మాసోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన గురువారం పిల్లల్లో వచ్చే ఊబకాయం పై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలకు ఆహార పదార్థాలలో చక్కెర మరియు నూనె తగ్గించి వినియోగించుకోవాలని సూచించారు. భట్లపెనుమర్రులో సూపర్వైజర్ ఏఎస్ కళ్యాణి పాల్గొనగా, కూచిపూడి-4 కేంద్రంలో కార్యకర్త.ఆర్ నాగమణి, కొండవరంలోకార్యకర్త దుర్గా ఎం జె లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్ఏల ధర్నా

విశాలాంధ్ర-కూచిపూడి : తమ సమస్యల పరిష్కారం కోసం, అర్హులైన వీఆర్ఏలకువీఆర్వోలుగా పదోన్నతి కోసం రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపుతో రెండు రోజులు పాటు నిర్వహించే ధర్నా కార్యక్రమంలో భాగంగా తొలిరోజైన గురువారం మొవ్వ తాసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలుధర్నాకార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి మొవ్వ మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు పెడసనగంటిరాజేష్ నాయకత్వం వహించారు..

గన్నవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ మహాసభ గురువారం గన్నవరం సీపీఐ కార్యాలయం లో మహాసభ జరిగింది. అతిథులుగా రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎండి ప్రసాదు జోనల్ కార్యదర్శి వై శ్రీనివాసరావు, జోనల్ జాయింట్ సెక్రెటరీ ఏ జే రత్నాకర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీవీఎస్ నారాయణ, వైవి రావు జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ టీవీ కె రావు, జిల్లా కమిటీ సభ్యులు భాను లక్ష్మి కే బి ఎం రావు సమక్షంలో మహాసభ జరిగింది. ఈ మహాసభలో గన్నవరం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా బొద్దు కోళ్ల సంజీవరావు, కార్యదర్శిగా టీవీ రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీవీ వి నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పిల్లలకు బయట ఆహారాలు పెట్టరాదు : సీడీపీఓ మంగమ్మ

విశాలాంధ్ర-గన్నవరం : పిల్లలకు బయట ఫుడ్ పెట్టకూడదని దానివల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని సి డిపిఓ జి మంగమ్మ తల్లిదండ్రులకు సూచించారు. గురువారం గౌడ్ పెట అంగన్వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం 17 సెప్టెంబర్ నుండి 16 అక్టోబర్ వరకు సుపోషిత్ భారత్ సక్షం భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిహెచ్ నాగ పద్మావతి అంగన్వాడి కార్యకర్తలు పిల్లల తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలోని చీమలపాడులో సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు ఆధ్వర్యంలో అంతర్గత సీసీ రోడ్ల వెంబడి ఉన్న మురుగు కాల్వలు, ఇళ్ల మధ్యలో చేరిన మురుగునీటిని బయటికి పారద్రోలే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, అలానే బ్లీచింగ్, ఫాగింగ్‌ను పిచికారి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్య గన్యా సచివాలయ కార్యదర్శి బి గోపికృష్ణ, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం హైమేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యాలయంలో మొక్కలు తొలగింపు

విశాలాంధ్ర-ఏ కొండూరు : ఇటీవల విశాలాంధ్ర పత్రికలో ప్రచురించిన అరణ్యమా.. కార్యాలయమా.. ? అనే కథనానికి స్పందించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి పజ్జూరి శ్రీనివాసరావు గురువారం స్పందించి మండల పరిషత్ కార్యాలయ ఆవరణను పరిశుభ్రం చేసే విధంగా అడుగులు వేసి కార్యాలయ ఆవరణలో ఉన్న పెద్దపెద్ద పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని శానిటేషన్ సిబ్బందితో చేయించారు. గ్రామాలలో తాగునీరు సరఫరా అయ్యే ట్యాంకులను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి పరిశుభ్రంగా ఉండే విధంగ చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సర్పంచులకు సూచించారు.

పాల రైతులకు సొసైటీ బోనస్ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణా మిల్క్ యూనియన్ సొసైటీలలో పాలు పోసి నెలవారి పాల డబ్బులతో పాటు సొసైటీ బోనస్, సంవత్సరానికి మూడుసార్లు యూనియన్ అందజేసే బోనసు తీసుకొని కుటుంబ సభ్యులతో పాడి రైతులు పండగ వాతావరణంగా ఆనందంగా గడపాలని పామర్రు శీతల కేంద్ర మేనేజర్ చిట్టూరి దామోదరకృష్ణ గోపీనాథ్ పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షురాలు పైడి పాముల మనోహరం అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో డైరెక్టర్లు సూపర్వైజర్ రమేష్, వేతన కార్యదర్శి మహంకాళి సత్య శ్రీనివాస్, టెస్టర్ లంకపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరావు కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర-విస్సన్నపేట : విస్సన్నపేటకు చెందిన ప్రముఖుని కుటుంబసభ్యులను తెలంగాణా రాష్ట్ర మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. మండలంలోని కొర్లమండ గ్రామానికి చెందిన జువ్వా భాస్కరరావు ఉన్నత విద్యాభ్యాసం అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక వేత్తగా స్థిరపడ్డారు. ఇటీవల భాస్కరరావు తండ్రి శేషగిరి రావు మరణించగా, తెలంగాణా మంత్రి సీతక్క గురువారం కొర్లమండ గ్రామంలోని భాస్కరరావు కుటుంబసభ్యులను కలసి పరామర్శించారు. అనంతరం విస్సన్నపేట మండలంలోని పలువురు టీడీపీ నాయకులు మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని అమరావతిలో వైద్య సేవలను మెరుగుపర్చాలని, ప్రజావసరాలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది నియామకానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను గ్రామస్తులు కోరారు. గురువారం కలెక్టర్ రాజధాని ప్రాంతం తుళ్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. వైద్య సేవలపై వైద్యాధికారి డి.శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా అమరావతి జేఏసీ నాయకులు కాటా అప్పారావు, నాగబాబు, కంతేటి తిరుమల బాబు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. రాజధాని దృష్ట్యా తుళ్లూరులో ఆరేళ్ళ క్రితం రూ.4 కోట్ల వ్యయంతో సామాజిక ఆరోగ్య కేంద్రం(30 పడకల ఆసుపత్రి)ని నిర్మించి వైద్యులు, సిబ్బందిని మాత్రం నియమించలేదన్నారు. పరిసర గ్రామాల ప్రజలతో పాటు రాజధాని నిర్మాణానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది కార్మికులు వైద్యం కోసం ఆసుపత్రికి వస్తారని, కానీ తగినంత మంది వైద్యులు లేరని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలం కావడంతో కేవలం ఇద్దరు డాక్టర్లు, సిబ్బంది 30 పడకల ఆసుపత్రిలో ఉంటూ వైద్యం అందిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సామాజిక ఆరోగ్య కేంద్రంకు మాత్రం వైద్యుల నియామకం జరగడం లేదన్నారు. రాజధాని దృష్ట్యా సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్యం అందేలా అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించాలని, రాత్రి వేళల్లో డాక్టర్లు అందుబాటులో ఉండాలని, 108 వాహనం ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మనసు పెట్టి చేస్తే ఆవిష్కరణలు సాధ్యమే

- పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విద్యార్థులు మనసు పెట్టి చేస్తే ఏ ఆవిష్కరణలు అయినా సాధ్యమేనని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ ప్రొమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ ఆధ్వర్యంలోని ఈసెల్ ఆధ్వర్యంలో 'ఇట్స్ మై స్టోరీ' అనే ఇతివృత్తంతో గురువారం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చింతకింది మల్లేశం మాట్లాడుతూ పటాసరాలు తయారు చేసే సమయంలో తన తల్లి గంటల తరబడి కూర్చుని 'అసు' పనిని చేస్తుందేదని, దీని వల్ల ఆమెకు భుజాలు, చేతులు నొప్పితో బాధపడేవారు. ఒక చీరకు అసు పోయాలంటే దాదాపు 9000 సార్లు చేతిని అటు ఇటూ తిప్పాల్సి వచ్చేదన్నారు. తన తల్లికష్టాన్ని తగ్గించడా నికి అసు యంత్రాన్ని తయారు చేయాలనే సంకల్పం మొదలైందన్నారు. అసు యంత్రం తయారీ పనిని ముందుగా తాను 5 విభాగా లుగా విభజించుకున్నానని పేర్కొన్నారు. ఒక్కో విభాగం పని పూర్తవ్వడానికి ఒక సంవత్సరం పట్టిందన్నారు. అలా 2 విభాగాలు పూర్తి అయిన తర్వాత యంత్ర నమూనాలు సరిగా పనిచేయలేదు. పదే పదే తప్పులు జరిగాయి. అయినా వెనుకడుగు వేయలేదని తెలియజేసారు. యంత్రం తయారీకు అవసరమైన భాగాలు కొనడానికి సరిపడా డబ్బు లేకపోవడం పెద్ద సమస్య అయ్యిందన్నారు. ఇలా దాదాపు 7 సంవత్సరాల పాటు నిరంతర ప్రయత్నాల తర్వాతనే 'అసు యంత్రం' విజయవంతమైందని విద్యార్థులతో పంచు కున్నారు. విద్యార్థులు ఏదైనా ఆవిష్కరణలు చేయాలనుకుంటే వారికి 24 గంటలు అదే ధ్యాస, తపన, పట్టుదల ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, డైరెక్టర్లు, విజ్ఞాన్ ఈ-సెల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అసమాన త్యాగశీలి వావిలాల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సమున్నత ఆదర్శాలకు, స్వచ్ఛత, నిర్భీతి, నిరాడంబరత, నిస్వార్థ ప్రజాసేవకు జీవితాన్ని త్యాగం చేసిన అనుపమాన త్యాగశీలి వావిలాల గోపాలకృష్ణయ్య అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. వావిలాల జయంతి సందర్భంగా స్థానిక అరండల్‌పేటలోని కార్యాలయంలో పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వావిలాలకు నివాళులర్పించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో 14సార్లు అరెస్ట్ అయ్యి ఏడుసార్లు కఠిన కారాగార శిక్ష అనుభవించిన వావిలాల నిత్య పోరాట శీలిగా నమ్మిన విలువలు, విశ్వాసాల కోసం కడదాకా పోరాడిన నిత్య ఉద్యమ శీలి అన్నారు. స్వాతంత్ర్యం సాధించిన తరువాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం, విశాలాంధ్రోద్యమం, గ్రంధాలయోద్యమం, మద్యపాన నిషేధ ఉద్యమం, రైతాంగ ఉద్యమం లాంటి అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారని, చివరి క్షణం వరకు తెలుగువారి కోసం, తెలుగు భాష అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన యోధుడు వావిలాల అన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగకుండా ఎనిమిది దశాబ్దాల పాటు అవిశ్రాంత పోరాటం జరిపిన మహోన్నత గాంధేయవాది, మచ్చలేని ప్రజాప్రతినిధి వావిలాల అని కొనియాడారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి సింగరయ్య, ఇంజినీర్ ఘనశ్యామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-ఈపూరు : మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం ప్రభుత్వం కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో రక్తహీనత, బరువు లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. వీటికి చెక్‌పెట్టి, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ సెప్టెంబరు నెలను పోషణ మాసోత్సవంగా నిర్వహిస్తోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని, సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని సీడీపీఓ వాణి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో గురువారం జన ఆందోళన్ పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి తల్లి, బిడ్డకు సరైన పోషణతో పాటు ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ షమీమా, డాక్టర్‌నవీన్ ఆషాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సీతామాలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ మండలంలోని తంగెడ ప్రధాన పాఠశాల, దాచేపల్లి బీసీ కాలనీ పాఠశాలల్లో పని చేస్తున్న మంచా రాజశేఖర్, పావులూరి వాణిశ్రీ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన విషయం విధితమే. దాంతో ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నారాయణపురంలోని సీబీఐ కల్యాణ మండపంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. వారిద్దరినీ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు, ఇటీవల బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు, కేసానపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ తోట అరుణను ఘనంగా సత్కరించారు. ఈ ఆత్మీయ సభలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జోసఫ్ సుధీర్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు లింగిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, ఎంఈఓ పినాకపాణి, మండల శాఖ అధ్యక్షుడు బొంబోతుల వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, సంఘ నేతలు చెట్టిపోగు ఏసురత్నం, సోము వెంకట రమణ, దాసరి కొండలు, ఆదెపు రాజేష్, చెట్టిపోగు రాములు, గుడిబండి శ్రీనివాస రెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, నామినీగా పనిచేస్తున్న వీఆర్‌ఓల వారసులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజేష్, కిరణ్ కుమార్, సతీష్, ఆరోను, సీతారామయ్య పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-యడ్లపాడు : మండలంలోని లింగారావుపాలెం గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న సమాచారంతో యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ గురువారం సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3700ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పోస్టాఫీస్‌లో పనిచేయని నెట్ వర్క్

- ఇబ్బందిపడుతున్న ఖాతాదారులు

విశాలాంధ్ర-దాచేపల్లి : పోస్టాఫీస్‌లో గత 12 రోజులుగా నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. తద్వారా తపాలాసేవలకు ఆటంకం కలుగుతోంది. నారాయణపురం బంగ్లా కూడలి ప్రాంతంలో ఉన్న సబ్‌పోస్టాఫీస్‌లో సాంకేతిక సమస్య(సర్వర్ ప్రాబ్లమ్) కారణంతో ఖాతాదారులు ఆ కార్యాలయం మెట్లు ఎక్కలేక, పాట్లు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరుమండలం వడ్డీ ముక్కల-జడవల్లి గ్రామాల మధ్య పంట కాలువలో గురువారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గత బుధవారం కాలువలో పడి మృతి చెంది ఉంటాదని లేదా ఏదైనా ఘటన జరిగిందా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీరనాట్యం కళాకారులను ప్రభుత్వం గుర్తించాలి

విశాలాంధ్ర-మాచర్ల : కవులు, రచయితలు, వీరనాట్యం కళాకారుల కళను గుర్తించి ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని శ్రీ వీరబ్రహ్మేంద్ర ప్రజా హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు గురజాల అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం గురజాల అప్పారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి కవులు, రచయితలు, వీర నాట్యం కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి సమాజ మార్పు కోసం కృషి చేస్తున్నారన్నారు. తమ తమ కళలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించి జీఓను జారీ చేయాలన్నారు. తద్వారా వారి జీవనోపాధికి లబ్ది చేకూరేలా ప్రభుత్వం ముందడుగు వేయాల న్నారు. ప్రతి శుభకార్యానికి ముందుగా వీరనాట్య కళాకారులచే వీరనాట్యంతో, బియ్యం కొలన వంటి కళను ప్రదర్శింపజేయడం పూర్వం నుంచి వస్తున్న సాంప్రదాయం అన్నారు. విషయాన్ని ఇటీవల జరిగిన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నాడు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సేవారత్న అవార్డు గ్రహీత డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సుతారం వాసు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఏజెంట్‌గా కేంద్ర ఎన్నికల సంఘం: మాజీ ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మోదీ ఏజెంట్‌గా కేంద్ర ఎన్నికల సంఘం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న సీపీఎం కార్యాలయంలో భారత రాజ్యాంగం-ఎన్నికల కమీషన్-బీహార్ ఓటు పరిణామాలు అంశంపై జరగనున్న సభ ఆహ్వాన పత్రికలను యూటీఎఫ్ హాలు లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఐదు గంటలకు జరగబోయే సభకి భీమ్ సేనా సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, అంబేద్కరిస్ట్ ఎస్.ప్రకాష్, చారువాక యువ జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్ తదితరులు పాల్గొం టారని వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దు ప్రేమ్ జ్యోతి బాబు, నల్లపు నీలాంబరం, డాక్టర్ మూకిరి సుధ, తిప్పాబత్తిన గోవిందు, డేవిడ్ విలి యమ్స్, శిఖా సురేష్, చిప్పి భాష, ఈమని హనుమంతరావు పాల్గొన్నారు.

నూతక్కిలో రూ.4 లక్షల ఎల్ఓసీ చెక్కు అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళ గిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన తోట శివశంకర్‌కు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4 లక్షలు విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) మంజూరైంది. టీడీపీ నాయకులు బాధితుడు చికిత్స పొందుతున్న గుంటూరు కిమ్స్ చైత్ర హాస్పిటల్‌కు వెళ్లి కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఎల్ఓసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఫార్మసిస్టులుగా ఎదగాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఫార్మసి విద్యార్థులు ఫార్మకో విజిలెన్స్ ప్రాముఖ్యతను, వాటి ఉపయోగాలపై అవగాహన కలిగి ఉండాలని జీజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. స్థానిక హిందూ ఫార్మసి కళాశాలలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలలో రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలకు సంబందించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఫార్మసి విద్యార్థులు తమ కళాశాల యాజమాన్యం వారు ఏర్పాటు చేసిన మౌలిక వసతులను వినియోగించుకుని ఉత్తమ ఫార్మాసిస్టులుగానూ, ఉత్తమ పౌరులుగానూ అభివృద్ధి చెందాలన్నారు. జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా విద్యా ర్థులకు ఈ-పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలను నిర్వహించారు. తమ కళాశాల నుంచి ఆలా హాస్పిటల్ వరకు ఫార్మకోవిజిలెన్స్ ప్రాముఖ్యతను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధు సూధనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ప్రత్యూష, ఫార్మసి ప్రాక్టీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.హేమ కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తిని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్చం అందించారు.

న్యాయం చేయాలని
బాధిత కుటుంబ సభ్యులు ధర్నా

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణం భావనగర్ కాలనీకి చెందిన చిమటా హరిప్రసాద్ కుటుంబ సభ్యులు గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తమ ఇంటి యజమాని శివనాగ మల్లేశ్వరరావు తమపై దాడి చేసి, ఇంటి సామాన్లను ఎత్తుకెళ్లారని బాధితులు ఆరోపించారు. స్థానిక సీఐ తమ ఫిర్యాదును పట్టించుకోవడం లేదని, శివనాగ మల్లేశ్వరరావుపై కేసు నమోదు చేసి, తమ సామాన్లను ఇప్పించాలని బాధితులు కోరారు.

జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఏపీ జీఈఏ జిల్లా నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో గుర్తింపు పొందిన ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘం నాయకులతో జిల్లా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)గుంటూరు జిల్లా నాయకులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జీఈఏ

నాయకులు నూతనంగా విధుల్లో చేరిన గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖ్రి, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోటా సాహెబ్, జిల్లా కోశాధికారి, పోతురాజు, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రాదేవి, షబానా, అరుణ కుమారి, రమణి తదితరులు పాల్గొన్నారు.

జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ

- మీడియా సమావేశంలో శిర రమేష్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆమ్ ఆద్మీ పార్టీని బలోపేతం చేయటంలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శిర రమేష్ కుమార్ గుంటూరు వచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో మీడియా సమావేశం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ టి.సేవ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ శిరా రమేష్ కుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు విశేష కృషి చేస్తున్న పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ అని అన్నారు. కోతలేని విద్యుత్తు, మంచినీళ్లు, శానిటరీ వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యతను ఇస్తున్న పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ అని, ఇటువంటి వాటికోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం పార్టీ రాష్ట్ర కమిటీ..అన్ని జిల్లాలోని కమిటీలు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి నుంచి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ అన్ని స్థానాల్లో బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎంపిటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు పార్టీ కార్యాచరణ చేస్తున్నట్లు స్పష్టంచేశారు. ప్రజా సేవ చేస్తూ..ప్రజలను ప్రలోభాలకు గురి చేయకుండా ప్రజాసేవలో ముందుండాలనే వారిని తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి పని చేయాలనుకునేవారు తమ 9493595789 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కూటమి ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం వైసీపీ పార్టీ కూడా బీజేపీ కనుసన్నల్లోనే ఉందనేది ఇటీవల కేంద్రం నిర్వహించిన ఎన్నికల్లో స్పష్టమైనట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడే ఏకైక పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ అని అన్నారు. కుల, మత రాజకీయాలు కాకుండా ప్రజల కోసం పని చేయాలని పని చేయాలనుకునేవారు ఆమ్ ఆద్మీ పార్టీతో చేతులు కలిపి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. వంద మంది ఎమ్మెల్యేలతో మా ఒక్క ఎమ్మెల్యే సమానమన్నారు. మీడియా సమావేశంలో తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ రాచపూడి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పురపాలక సంఘ పరిధిలోని వార్డు సచివాలయాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. పిడుగురాళ్ల పట్టణంలోని 6వ వార్డు సచివాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో టీడీపీ సీనియర్ నాయకులు 9వ వార్డు ఇన్‌చార్జ్ లెక్కల వెంకటేశ్వర్లు(ఎల్‌వీఆర్) లబ్దిదారులకు అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో వార్డు నాయకులు కొంకా సుబ్బారావు, కోటిరెడ్డితోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. 17వ వార్డు సచివాలయం పరిధిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం జరిగింది. పంపిణీలో టీడీపీ సీనియర్ నాయకులు వద్దవల్లి సర్వేశ్వరరావుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డులు పొందేందుకు లబ్దిదారులందరూ ఒకేసారి సచివాలయాల వద్దకు చేరుకొని కార్డులు కోసం ఎగబడ్డారు. ఈ సమయంలో ఆయా వార్డుల పరిధిలో సరిపడా సిబ్బంది లేక కార్డులు అందజేసేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఎదురవటం ఒకవైపు సర్వర్ సమస్యతో కార్డుదారుని ఈ కేవైసీ నమోదుకు అంతరాయం ఏర్పడి మరింత సమస్య తలెత్తింది.

27న ఏఎల్‌బీఈడీ
కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

- ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన ఏఐఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ జోసెఫ్ పీఎస్



విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఈ నెల 27వ తేదీన స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల 75వ సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్తేరు సునీల తెలిపారు. ఏఈఎల్‌సి అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను ఏఈఎల్‌సి అడ్మినిస్ట్రేటర్, ఫార్మర్ సబ్ జడ్జి ఆఫ్ కేరళ, రిటైర్డ్ సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి జోసెఫ్ పిఎస్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు సునీల్ ఏఎల్ బిఈడి కళాశాల 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలు అంశాల గురించి అడ్మినిస్ట్రేటర్ కి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి తప్పకుండా విచ్చేయాలని మీ రాక మాకు సంతోషాన్ని కలిగిస్తుందని కళాశాల సిబ్బంది, అధ్యాపకులు సాదరంగా ఏఈఎల్‌సి అడ్మినిస్ట్రేటర్‌కు ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానం పలికారు. ఆయన చేతుల మీదుగానే ఆహ్వాన పత్రికను ఆవిష్కరింపజేశారు. ఏఈఎల్‌సి విద్యాసంస్థల్లో ఆంగ్ల భాష ప్రాధాన్యం ఎనలేనిదని, దానిని ఈ కాలపు ఉపాధ్యాయులు ప్రిన్సిపల్స్ మరింత పకడ్బందీగా ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కళాశాల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయోలా స్కూల్ విద్యార్థులు
రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-వినుకొండ: అర్హత సాధించిన గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో లొయోలా హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందనలో లయోలా హై స్కూల్ కరస్పాం డెంట్ రెవ. ఫాదర్ జ్ఞానదేవన్ యస్.జే మాట్లాడుతూ మా పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి కంచర్ల నాగసాయి పెంటథలీన్‌లో 600 మీటర్స్, 60 మీటర్స్, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్-16, 600 మీటర్స్‌లో 10వ తరగతి విద్యార్థి తెల్ల మేకల వెంకట శివ ప్రసాద్ 02వ స్థానంలో నిలిచాడు. అండర్-16, 60 మీటర్స్‌లో 10వ తరగతి విద్యార్థి భువనగిరి ఏడుకొండల సాయి 02వ స్థానంలో నిలిచాడని ఈనెల 27,28,29 తేదీలలో రాష్ట్రస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో జరిగే అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో లయోలా హై స్కూల్ హెడ్ మాస్టర్ రెవ ఫాదర్ అవినాష్ , లయోలా హైస్కూల్ ఫాదర్స్ రెవ. ఫాదర్ లియో యస్.జే. పాల్గొన్నారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: యూనిట్ నం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నం.71ఎ, పొవై, పాస్పోలి, ముంబై-400087

స్వాధీనత ప్రకటన

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అధీకృత అధికారియైన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత, తనఖాదారు, సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు :- (1) ఎం/ఎస్. సురేష్ ఏజెన్సీస్ (రుణగ్రహీత), (2) శ్రీ పిడికిటి సురేష్‌బాబు తండ్రి సీతారమణ (సహ-రుణగ్రహీత) (3) శ్రీమతి పిడికిటి సీతారావమ్మ భర్త సురేష్‌బాబు (4) శ్రీ పిడికిటి సాంబశివరావు తండ్రి సురేష్‌బాబు, (5) శ్రీమతి పిడికిటి ప్రవంతి భర్త సాంబశివరావులకు నోటీసులో ప్రస్తావించిన మొత్తం బకాయి రుణఖాతా FEDPTBSTL0478754 నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చులు వగైరాలతో కలిసి తేదీ:04.06.2025 నాటికి రూ.39,36,029.00/- (ముప్పైతొమ్మిది లక్షల ముప్పైఆరువేల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) లను నోటీసు తేదీ నుండి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తేదీ : 10.06.2025 న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున దిగువ సంతకందారు నిబంధనల్లో తెలిపిన నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించిన ఆస్తిని సెప్టెంబరు 12,2025 న లాంఛనప్రాయంగా స్వాధీనపర్చుకొనడమైందని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని మరియు ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు, రుణఖాతా FEDPTBSTL0478754 నందు ఒప్పంద వడ్డీ రేటు ప్రకారం భవిష్యత్తు వడ్డీ ప్లస్ దానిపై అన్ని వ్యయాలు మరియు యాదృశ్చిక ఖర్చుల వగైరాలతో కలిసి తేదీ: 04.06.2025 నాటికి రూ.39,36,029.00/- (ముప్పైతొమ్మిది లక్షల ముప్పైఆరువేల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) ల కొరకు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత/తనఖాదారు/సహ-రుణగ్రహీత(లు)/హామీదారు మరియు సాధారణప్రజలను హెచ్చరించడమైనది.
హామీగా పెట్టిన ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.
షెడ్యూల్: తనఖా పెట్టిన ఆస్తి వివరాలు: గుంటూరు జిల్లా, తాడికొండ సబ్-జిల్లా, తాడికొండ మండలం, నిడుముక్కల గ్రామ పంచాయతీ ఏరియా, నిడుముక్కల గ్రామం, డి.నం.183/ఎ, పాత డోర్ నం.4-72, కొత్త డోర్ నం.5-97, అసెస్‌మెంట్ నం.897, ఆర్‌సిసి డాబా ఇంటితో పాటు 139 1/2 చదరపు గజాల విస్తీర్ణపు ఆస్తి మొత్తంగా. సరిహద్దులు: తూర్పు: 10 అ॥ల వెడల్పు ఉమ్మడి దారి, పడమర: కొంత విస్తీర్ణం పిడికిటి రామస్వామి ఇల్లు మరియు కొంత విస్తీర్ణం బండ్ల సామ్రాజ్యం ఆస్తి, ఉత్తరం: నెప్పల్లి కోటేశ్వరరావు గోడ, దక్షిణం: ఈ ఆస్తి మరియు పిడికిటి సత్యనారాయణ ఆస్తి మధ్య ఉమ్మడి కాంపౌండ్ గోడ.

ప్రదేశము : గుంటూరు
తేదీ : 12-09-2025

సం/- (అధీకృత అధికారి)
ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

CHANGE OF NAME

I, KOLLERI MELLESWARI (Old Name), W/o. yemineni siva nageswara rao, Resident of Door No:15-8-208/1, Darsi Pedamasthan Nagar, Near Krishna Temple, Kotravari Street, Bapatla, Bapatla District - 522101, Andhra Pradesh. I have changed my name as **YEMINENI MALLESWARI**. Hereafter my name is known as **YEMINENI MALLESWARI**.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

పిడుగురాళ్ల గ్రామానికి చెందిన కూరాకుల మస్తాన్ రావు,S/o. కూరాకుల ఆదెయ్య, వాసవి నగర్, డి.నెం. 8-659/4-1, రైల్వే స్టేషన్ రోడ్డు, పిడుగురాళ్ల (మం), పల్నాడు జిల్లా. నా తాలూకు గుంటూరు సబ్ రిజిస్టర్ వారి ఆఫీసులో ఒకటవ పుస్తకం దస్తావేజు నంబర్.1694/2012గా రిజిస్టర్ కాబడిన విక్రయ అగ్రిమెంట్‌తో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ కూడిన ఒరిజినల్ దస్తావేజు. **దీ.02-09-2025న** నా ఇంటి నుండి జానపాడు రోడ్డు లోని జిరాక్స్ సెంటర్‌కు తీసుకొని వెళుతుండగా మార్గమధ్యంలో పోయినది. ఎవరికైనా దస్తావేజులు దొరికిన ఎడల ఈ క్రింది నంబరుకు తెలియజేయగలరు.
సెల్ నెం :9381322918

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తత : రామచంద్ర రాజు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్యాన్సర్ వ్యాధి సోకిన తరువాత నివారణ చర్యలు చేపట్టే కన్నా క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్ర రాజు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ, ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'హెయిర్ డొనేషన్ ఫర్ క్యాన్సర్ పేషెంట్స్' కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు చికిత్స కాలంలో శారీరకంగా బలహీనమవడమే గాక జుట్టు పూర్తిగా రాలిపోయి మానసికంగా వేదనకు గురి అవుతూ ఉంటారని, అటువంటి వారికి స్వాంతన కలుగ చేస్తూ హెయిర్ డొనేషన్ చేస్తున్న మహిళలు అభినందనీయులని తెలిపారు. ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ అధ్యక్షురాలు గౌరీ శిరీష తన వినూత్న ఆలోచనలతో తాను తన కేశాలను దానం చేయటమే కాక తన తోటి మహిళలను తలనీలాల డొనేషన్ చేయు విధంగా ప్రేరణ కలగచేయటం సంతోషమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయ టానికి రెడ్‌క్రాస్ ఎల్లవేళలా తన సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వాలంటీర్‌గా, ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలిగా గౌరీ శిరీష తన విశేష సేవలు అందజేస్తుందని, రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్ర రాజు సహకారంతో మహిళలు నేడు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకి హెయిర్ డొనేషన్ చేయటం చాలా ఆనందంచ దగ్గ పరిణామమని కొనియా డారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేడూరి భాస్కరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీవాణి, రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు ఏ.రవి శ్రీనివాస్, రోటరీ క్లబ్ ప్రతినిధి శ్రీధర్ బాబు, కళాపీఠం కార్యదర్శి విజయ కుమార్ పాల్గొన్నారు.

ప్రాధమిక వైద్యశాలలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-యద్దలపాడు : యద్దలపాడు ప్రాధమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ నారీ స శక్త పరివార్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో స్త్రీలకు గర్భాశయ ముఖద్వార కేన్సర్, మధుమేహం, బీపీ, వంటి పలు పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. వైద్యాధికారి భరద్వాజ్, సీహెచ్ఓ పున్నారావు, ఎంపీడీవో హేమలతా దేవి, డెప్యూటీ ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ విక్టరీ మధుసూదనరావు సంస్మరణ

విశాలాంధ్ర-తెనాలి : విజయాన్ని ఇంటిపేరుగా మలచుకున్న వి.మధుసూధనరావు చిరస్మరణీయులు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలుపడి స్టూడెంట్ ఫెడరేషన్‌లో చేరి, కమ్యూనిస్టు సభ్యుడై కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేసిన మధుసూధనరావు గొప్పదర్శకునిగా ఎదిగిన వీరమాచనేని మధుసూధనరావు చిరస్మరణీయులని వక్తలు స్మృత్యాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తెనాలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణ సభలో భాగంగా గురువారం విక్టరీ మధుసూధనరావు సంస్మరణ సభ జరిగింది. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బొల్లి ముంత కృష్ణ అధ్యక్షత వహించారు. నటుడు, దర్శకుడు, నాటక కళాపరిషత్‌ల న్యాయ నిర్ణేత పాతూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నిషేధకాలంలో జైలుశిక్ష అనుభవించారన్నారు. సినీ రంగ ప్రవేశం చేసి 71 చలన చిత్రాలకు దర్శకత్వం వహించి విజయాలను తన ఇంటిపేరుగా మలచుకున్న ప్రతిభాశాలి విక్టరీ మధుసూధనరావు అన్నారు. సభా ప్రారంభంలో పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. గాయనీగాయకులు విప్లవ గేయాలు ఆలపించారు. విద్యార్థి దశలోనే నాటికలు ప్రదర్శించి బహుమతులందుకున్నారని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ హోల్ ట్రైనర్‌గా పనిచేశారన్నారు. అఖిల భారత స్టూడెంట్స్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారని వివరించారు. మద్రాసులో ఇప్టా ఆధ్వర్యంలో మధుసూధనరావు ప్రదర్శించిన నాటకం సినీ దర్శకులు ఎల్.వి.ప్రసాద్, ఎ.ఎన్. ప్రకాశరావు అభినందించారని చెప్పారు. అఖిల భారత శాంతి స్నేహ సభల్లో రాయలసీమ కరువు బాధి తుల సహాయార్ధి నాటకాలలో నటించారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల ప్రచార సభల్లో ఆచార్య, ఆత్రేయ, నాగభూషణం, జి.వరలక్ష్మిలతో కలసి మధుసూధనరావు, ఆయన భార్య సరోజినులు నటించారని చెప్పారు. ప్రప్రధంగా సతీతులసి చిత్రానికి దర్శకత్వం వహించారన్నారు.

సీపీఐ నాయకుడు పరచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయన సినిమాలలో సందర్భానుసారంగా కమ్యూనిస్టు భావజాలాన్ని శృసింపజేస్తారన్నారు. పదండి ముందుకు, మనుషులు మారాలి, మంచిరోజులొచ్చాయి అన్ని చిత్రాలు సిల్వర్ జూబ్లీ చిత్రాలేనన్నారు. అధ్యక్షత వహించిన బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ హిందీ, కన్నడ, తమిళ చిత్రాలకు కూడా దర్శకత్వం వహించారన్నారు. 32 మంది దర్శకులను అందించిన ఘనత విక్టరీదేనన్నారు. కె.రాఘవేంద్రరావు, ఓంశ్రీ, కోదండ రామిరెడ్డి, శేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారన్నారు. ఉత్తమ దర్శకునిగా ఫిలింఫేర్, ఫిలింఫాన్స్ వివిధ సంస్థల అవార్డులు రివార్డులు అందుకున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అభివృద్ధి సంస్థ బోర్డు అధ్యక్షులుగా అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారన్నారు. సభా ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలతో శ్రద్ధాంజలి ఘటించారు.

గంజాయి సేవిస్తున్న యువకులు అరెస్ట్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెం, టిడ్కో గృహాల్లోని ఒక ఇంటిలో కొంతమంది ఒక గుంపుగా గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు నల్లపాడు సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో ఎస్సై మహేష్ తన సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించి గంజాయి సేవిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ వంశీధర్ మాట్లాడుతూ చొప్పవరపు ప్రవీణ్ బాబు, జల్లెడ సాయి శ్రీనివాసరావులు గంజాయి తాగుతూ కొంత గంజాయిని తమకు తెలిసిన వారికి విక్రయిస్తుంటారన్నారు. ఈ క్రమంలో వెంగళాయపాలెంలో లైటింగ్ పనులు చేసుకుంటున్న చీలి వెంకటేష్, చీలి వెంకట సాయి, చుక్క ఆనంద బాబు, సాల్మన్ రాజు, మేక అజయ్ కుమార్ అనే వారికి విక్రయించారని తెలిపారు. ఈ ఆరుగురు నిందితులు కలసి చొప్పవరపు ప్రవీణ్ ఇంటిలో గంజాయి తాగుతుండగా సౌత్ డీఎస్పీ భానోదయ దిశానిర్దేశంలో దాడులు నిర్వహించి, వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అలాగే వారి వద్ద నుంచి 1.23 కేజీల గంజాయి సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గంజాయి సీజ్ చేయడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

సునీల్ సందీప్‌కు సన్మానం

విశాలాంధ్ర- తెనాలి : మైండ్ కేర్ ఫిజిలాజికల్ సొల్యూషన్ అనే వేదిక ద్వారా తెనాలి పట్టణానికి చెందిన కారుమంచి సునీల్ సందీప్ హిప్నాటిజం, ఆక్యుపంచర్ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థలో యాక్టివ్ పార్టిసిపెంట్ అవార్డు పొందిన సందర్భంగా గురువారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సాయి మంగా వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సునీల్ సందీప్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి మానసికంగా భావోద్వేగానికి గురై తీవ్రమైన ఒత్తిడితో మెదడుపై ప్రభావం చూపుతూ ఆకస్మిక మరణాలను చూస్తున్నాం. మానసిక రుగ్మతలతో అనేక రకాల కుటుంబ కలహాలను చూస్తున్నామని, వీటన్నిటికి హిప్నాటిజం ద్వారా శాశ్వత పరిష్కారం చూపగలమన్నారు. కార్యక్రమంలో సాయి మంగ వెల్ఫేర్ సొసైటి అధ్యక్ష కార్యదర్శులు కంకిపాడు రమేష్‌కుమార్, బి.సుధాకర్, సీనియర్ పాత్రికేయులు బొల్లిముంత కృష్ణ, ఐజెయు సభ్యులు ఓతుకోలు మార్కండే యులు, ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యదర్శి సాయి మణికంఠ, చిన్ని, మణి, సందీప్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పెదకూరపాడు : గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు అన్ని శాఖల అధికారులకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సోమయాజులు అధ్యక్షత వహించగా మీరయ్య మాట్లాడుతూ ఈనాటి కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని చెప్పారు. అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఆర్‌డీఓ శరత్, వైస్ ఎంపీపీ షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు కాదు, రైతులు సమస్య చూడాలి: బొల్లా

విశాలాంధ్ర - వినుకొండ : ఎరువులు అందక రైతులు అల్లాడుతున్నారు. రైతులు ఎరువులు కోసం రోడ్డు ఎక్కితే కేసులు పెడుతున్నారు. వేల టన్నులు ఎరువులు బ్లాక్ మార్కెట్ కు వెళుతుంటే, ఇదేమీ పట్టనట్లుగా, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్-సూపర్ హిట్ అంటూ సంబరాలు చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. గురువారం వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూ.4.50 వేల టన్నులు ఎరువులు వచ్చాయంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం సగం ఎరువులు మాత్రమే రైతులకు అందగా, 2 లక్షల టన్నుల ఎరువులు కూటమి నేతలు బ్లాక్ మార్కెట్ కు తరలించి జేబులు నింపుకుంటున్నారని బొల్లా ఆరోపించారు. ఇటీవల శావల్యాపురం మండలం కారుమంచి గ్రామంలో జరిగిన ఇరు వర్గాల ఘర్షణలో పోలీసు, అధికారులు పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి ఘర్షణలో ఎటువంటి సంబంధం లేని వైసిపి కార్యకర్తలపై 307 కేసులు పెట్టి జైలు పాలు చేశారని ఆయన మండి పడ్డారు. పోలీసుల అండతో టీడీపీ దౌర్జన్యాలకు పాల్పడు తున్నారన్నారు. ఆనాడు వైసీపీ ప్రభుత్వంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేయడం జరిగిందని, ఆనాడు మిర్చి ధర 25 వేల నుండి 30 వేల వరకు టన్ను ధర పలికిందన్నారు. రైతులు పలు రూపాల్లో అల్లాడుతుంటే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటం చేసుకుంటున్నది అన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తాను క్యాబినెట్ హోదా, చీప్ విప్ అంటూ గొప్పలు చెప్పుకుంటూ అధికారాన్ని అడ్డుపెట్టు కొని తన సొంత కంపెనీలకు చెందిన ఎరువులనే తీసుకువెళ్లాలని ఆయా డీలర్ల పై ఒత్తిడి చేస్తున్నారని బొల్లా ఆరోపించారు. ప్రతిరోజు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పై నిందలు వేయడమే తప్ప మరొకటి లేదని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పై ఘాటు విమర్శలు చేశారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని భయపెట్టి కూటమి ఇక వరికపూడిసెల నిధుల గురించి పదేపదే చెబుతున్న పార్లమెంటు సభ్యులు శ్రీకృష్ణదేవరా యలు ఆనాటి వైసీపీ ఎంపీగా ఉన్న విషయం నిధుల గురించి అప్పుడు మాట్లాడిన మాటలే ఇప్పుడు చెబుతున్నారన్నారు. వైసీపీ నాయకులు కే.కృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, కే.దేవరాజ్, పగడాల వెంకటరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తమ్మిశెట్టికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-మంగళగిరి : టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని ఎంఎస్ఎస్ భవన్ టీడీపీ కార్యాలయంలో ఆమెను పలువురు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ శాలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ్మిశెట్టి జానకి దేవికి శుభాకాంక్షలు తెలియజేశారు.

MUNICIPAL CORPORATION: GUNTUR

REQUEST FOR PROPOSAL (RFP)

Roc.No.853747/2024/E4 **Date: 18-09-2025**

Guntur Municipal Corporation invites Request for Proposal (**RFP**) for the preparation of **DPR** for comprehensive storm water drainage system to Guntur Municipal Corporation from the consultants who are having experience in preparation of DPR for Storm Water Drainage network duly reviewing the existing condition and providing of feasibility analysis, detailed planning, designs and estimates etc.,

The interested parties can collect the RFP Document from **20-09-2025** onwards from the O/o Commissioner, Guntur Municipal Corporation, **Contact No: 9849908395** or drop a mail to se.gunturcorp@gmail.com

The bid documents should reach the O/o Commissioner, Guntur Municipal Corporation on or before **29-09-2025 by 3.00 PM**

Sd/- **Puli Sreenivasulu, I.A.S,**
Commissioner,
Municipal Corporation, Guntur.

విశాలాంధ్ర

పేదవాడి గుండె చప్పుడు సురవరం సుధాకర్‌రెడ్డి

▪ సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సీపీఐ అగ్ర నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి తన జీవితాన్ని ప్రజల కోసం, పేదల అభ్యున్నతి కోసం అంకితం చేశారని, విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన నిలువుటద్దమని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ మారుతీవరప్రసాద్ తెలిపారు. అమరజీవి సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ సురవరం పోరాట స్ఫూర్తి, నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకమని వివరించారు. నిరంతరం కార్మిక, కర్షక, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ఆలోచన చేసే మేధావి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా తుది శ్వాస విడిచే వరకు పనిచేశారని పేర్కొన్నారు. దోపిడీకి గురైన ప్రతిగొంతుకలోనూ నేనున్నానని భరోసా ఇచ్చిన వారిని, విద్యార్థులను సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై, దోపిడీపై స్పందించే రాజకీయ శక్తులుగా తీర్చిదిద్దారని, విద్యార్థి లోకం సమాజానికి బయట ఉన్న ఒక ప్రత్యేక ద్వీపం కాదని, అది సమాజంలోని వర్గ వైరుధ్యాలకు ప్రతిబింబమని ఆయన గుర్తించారని వెల్లడించారు. జాతీయ స్థాయిలో ఆయన ప్రసంగాలు మేధావులను ఆకట్టుకోవడమే కాకుండా, ఆయన ఆలోచనలు కొత్తతరాలకు మార్గదర్శమన్నారు. సురవరం నేతృత్వంలో పనిచేసిన అనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తర్వాత కాలంలో రాజకీయాల్లో మహానేతలుగా ఎదిగారని తెలిపారు. దోపిడీ, అణచివేత, అసమానత ఈ నేల మీద ఉన్నంతకాలం, వాటికి వ్యతిరేకంగా పోరాటం ఉన్నంతకాలం సురవరం బతికే ఉంటారని, ఆయన మాటలు, రాతలు, పోరాటాలు సీపీఐ నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశమన్నారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బొంత ధనరాజ్, గ్రామ సర్పంచి బొంత తిరుపతయ్య, నాయకులు ,ఓట్ల వెంకటేశ్వర్లు,ఎలికా శ్రీనివాస్, బొంత సుబ్బారావు, శాఖ కార్యదర్శులు పొలకటి ఏసోబు, బొంత కోటేశ్వర రావు (చిరంజీవి) , షేక్ నన్నే, షేక్ నానా, బొంత నాసర్, బొంతజ్యోతి, ఎర్రిబోయిన సుజాత, ప్రజానాట్యమండలి కళాకారులు బి.అయ్యమ్మ, చౌటుపల్లి నాగేశ్వరావు, చైతన్య,బి.నాసర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: సీజనల్ వ్యాధుల సమాచారానికి కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గురు వారం తెలిపారు. ప్రస్తుత వాతావరణ మార్పుల దృష్ట్యా గుంటూరు జిల్లాలో అంటు వ్యాధులు ప్రబలే అవకా శాలు ఉన్నాయని, ప్రజలందరూ అప్రమత్తతతో ఉండాలని కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 0863-2234014 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో ఏ ప్రాంతంలో అయినా ఆరోగ్య సంబంధిత సమస్యలు, అంటు వ్యాధులు, అతిసార, డెంగ్యూ, మలేరియా వంటి ఏ సమస్య ఉన్నా, అను మానాలు ఉన్నా తక్షణం కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. మరగకాచి చల్లా ర్చిన మంచినీటిని మాత్రమే త్రాగాలని పిలుపునిచ్చారు. ఏవైనా అనారోగ్య లక్షణాలను గుర్తించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని అన్నారు. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, సురక్షితం లేనివిధంగా విక్రయిస్తున్న ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోరాదని తెలిపారు. వ్యాధులు పట్ల ముఖ్యంగా అంటువ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండి, వైద్య అధికారులు, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సూచనలు, సలహాలు పాటించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-పెదకాకాని : అనారోగ్యంతో బాధ పడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొంద లేని బాధితులకు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా 9 చెక్కులు రూ.9,85,146ల మొత్తాన్ని పెదకాకాని మండలంలోని లబ్ధిదారులకు పొన్నూరు శాసనసభ్యులు ధూళి పాళ్ళ నరేంద్రకుమార్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని, మెరుగైన వైద్యం నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దర ఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్య మంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతిఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. పెదకాకాని మండల ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ కాల్వలోకి దిగి మద్యం సేవించిన వ్యక్తి

విశాలాంధ్ర-మంగళగిరి : కాజ గ్రామ పరిధిలోని గుంటూరు ఛానల్ కాలువలో అదే గ్రామానికి చెందిన దొడ్డక రాంబాబు(45) మద్యం సేవించి నీలల్లోకి దిగినట్లు మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. తద్వారా తాగిన మైకంలో ఈత కొట్టలేక కనిపించకుండా పోయినట్లు తమకు రాబడిన సమాచారంపై ఆచూకీ కోసం అగ్నిమాపక శాఖ సిబ్బంది, ఈత గాళ్లతో కలిసి వెతుకులాట ప్రారంభించినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ వెంకట్ ఘటన స్థలానికి చేరుకొని సహాయ చర్యలు ప్రారంభించారు.

పోషకాల ఆహారాన్ని తీసుకోవాలి



విశాలాంధ్ర-దాచేపల్లి : పోషకాలతో కూడిన మంచి ఆహారాన్ని తీసుకోవాలని గుర జాల సీడీపీఓ అపరంజి జ్యోత్స్న కోరారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమైన పోషకాహార మాసోత్సవాలు వచ్చే నెల 16 వరకు జరుగనున్నాయి. దీనిలో భాగంగానే కేసానపల్లి సెక్టార్ ఆధ్వర్యంలో గురువారం పెదగార్లపాడులో అవగాహన సదస్సు నిర్వహించారు. పురవీధుల్లో ప్రదర్శన చేశారు. పర్యవేక్షకురాలు అరుణశ్రీ, అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు, గర్భిణిలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పులిచింతలకు 2,03,905 క్యూసెక్కులు విడుదల

విశాలాంధ్ర-రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 13 క్రస్ట్ గేట్లు ద్వారా 2,03,905 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. టెయిల్ పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 13 క్రస్ట్ గేట్లు 3 మీటర్లు ఎత్తు ఎత్తి 2,03,905 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్టు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటి మట్టం ప్రాజెక్టు 75.50 మీటర్లకు గాను 75.36 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకు గాను ప్రస్తుతం 6.984 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. రెండు విద్యుత్ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పాదన నిలిపివేసినట్లు వెల్లడించారు. టీఆర్సీ లెవల్ 60.05 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం 1.90,486 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. పై నుంచి వచ్చే పరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేట్‌పరం విరమించుకోవాలి

విశాలాంధ్ర-గురజాల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో వైద్యానికి ప్రాధాన్యత తగ్గిందని వైసీపీ నాయకులు యెనుముల మురళీధర్ రెడ్డి విమర్శించారు. నాడు ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పలు రకాల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చిందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గురువారం గురజాలలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరాన్ని విరమించుకోవాలన్నారు. వైసీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలు, బడుగు బలహీనవర్గాలు ఇబ్బందులకు పడకూడదని, మారుమూల ప్రాంతాలలో వైద్యానికి ఇబ్బందులకు అవుతున్నారని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, వైద్యశాల నిర్మాణం జరిపారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు(బుజ్జి), పట్టణ అధ్యక్షుడు కె.అన్నారావు, మాజీ ఎంపీపీ వి.అమరా రెడ్డి, షేక్ పీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో 22న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-మంగళగిరి : యువతకు ఉద్యోగ అవకాశాలు అందించా లన్న దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళా స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరగనుంది. ఈ మేళాలో దేశవ్యాప్తంగా పేరుపొందిన ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్, రిటైల్, హెల్త్‌కేర్, సర్వీస్ రంగాలకు చెందిన అనేక కంపెనీలు పాల్గొని, వేలాది ఉద్యోగాలను యువతకు అందించనున్నాయి. ప్రతి అభ్యర్థి తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకువచ్చి, మేళా ద్వారా కలిగే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయని, నైపుణ్యాలతో కూడిన ప్రతిభకు సరైన వేదిక అవుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

రూ.2 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రణాళికలు : మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: "వెస్ట్ బైపాస్ వంతెనను సంక్రాంతి నాటికి అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. అయితే వైసీపీ ప్రభుత్వం అవలంబించిన ప్లానింగ్ లేని ప్రణాళికల వల్ల గుంటూరు టు విజయవాడ వెళ్ళే ప్రయాణికులకు కొంత ప్రయాణ దూరం పెరుగుతుంది. స్థానికులకు ఇబ్బంది లేకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం." అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. గుంటూరు నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్, విశాఖపట్నం కనెక్టివిటీకి ఉపయోగపడే వెస్ట్ బైపాస్‌ను పెమ్మసాని ఎన్‌హెచ్ఎఐ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ "నిర్మాణాలు, పెండింగ్ పనులు, అండర్ పాస్ వర్కులు తదితర అంశాలను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. కాగా గుంటూరు విజయవాడ మీదుగా వెళ్లే ప్రయాణికులకు హాయ్ ల్యాండ్ సమీపంలోని అండర్ పాస్ నుంచి యూ టర్న్ తీసుకుని జాతీయ రహదారి గుండా వెళ్లాల్సి ఉంటుంది. సాధారణంగా 2014 - 19 సమయంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిర్మాణాన్ని వైసిపి వచ్చాక పూర్తిగా గాడి తప్పింది. కాగా డిసెంబర్ చివరికి నిర్మాణం పూర్తి చేసి సంక్రాంతి కల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం పనులన్నీ సజావుగా సాగుతున్నాయి." అని పెమ్మసాని వివరించారు. ఈ పర్యటనలో ఎన్ హెచ్ ఎ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-దుర్గి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాలు తలపెట్టారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య పరీక్షలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సైదులు గ్రామ సచివాలయ గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి యేచూరి సునీత సాయి శంకర్ పాల్గొని పారిశుధ్య కార్మికులకు డ్రెస్, మాస్క్,చేతిగ్లజ్‌తో కూడిన కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు తన స్వంత డబ్బులతో ఆరోగ్య భీమా కడతానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గ్రీన్ అంబాసిడర్లకు హెల్త్ చెకప్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్, సర్పంచ్ అల్లూరయ్య, దుర్గి సెక్రటరీ కృష్ణ, ఏడుకొండలు, గజేంద్ర, రామకృష్ణ, వెంకటేష్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ బి.బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీల్లో విజేతలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల స్థాయిలో బాలుర విభాగంలో అండర్ 14, అండర్ 17 విభాగాలలో నిర్వహించిన కబడ్డీ, ఖొ-ఖో, వాలీబాల్ పోటీలలో విజేతలను మొవ్వ పిఎం శ్రీ శ్రీమండవకనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ ఉమాశ్రీ గురువారం ప్రకటించారు. అండర్ 17 సీనియర్స్ విభాగంలో కబడ్డీలో విన్నర్స్ గా మొవ్వ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు, రన్నర్స్ గాకోసూరుజిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల బృందం నిలిచారు. అలాగే ఖొ-ఖోలో విన్నర్స్ గాభట్లపెనుమర్రుజిల్లా పరిషత్ హై స్కూల్,రనర్స్ గా మొవ్వ హెూలీ స్పిరిట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ లో విన్నర్స్ గా మొవ్వ హైస్కూలు, రన్నర్స్ గా నిడుమోలు హైస్కూల్ నిలిచింది. అండర్ 14 జూనియర్స్ విభాగంలో కబడ్డీలోమొదటి రెండు స్థానాల్లోమొవ్వహైస్కూలు, కాజ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. వాలీబాల్ లో నిడుమోలు హైస్కూలు, మొవ్వ హై స్కూలు మొదటి రెండు స్థానాలను సాధించగా, ఖొ-ఖోలో కాజ హైస్కూలు, భట్లపెనుమర్రు హై స్కూలు విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చెస్ పోటీలలో సీనియర్స్ విభాగంలో పెదసనగల్లు హై స్కూల్ విద్యార్థులు ఆర్.లోకేష్,వి. వీరేంద్రనాథ్, జూనియర్స్ విభాగంలో పి విజయ్ (కాజ) టి.ధర్నేష్(భట్లపెనుమర్రు) వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారని ప్రధానోపాధ్యాయురాలు ఉమాశ్రీతెలిపారు. ఈమె తో పాటు.పి.డి. ఎం.ఎల్.పి. ఎస్.ఎస్ మనోహరి, పి ఈ టి టీవీ దాన రావు పాల్గొన్నారు.

విక్రేతల లావాదేవీలలో 25 శాతం వృద్ధి నమోదు చేసిన ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్

విశాలాంధ్ర-విజయవాడ: విక్రేతల లావాదేవీలలో 25 శాతం వృద్ధిను ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ నమోదు చేసిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంకి మరింత వృద్ధి జరిగే అవకాశం ఉందని ఫ్లిప్‌కార్ట్ ఎస్ వి పి మరియు మార్కెట్‌ప్లేస్ హెడ్ సకైత్ చౌదరి తెలిపారు. భారతదేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, పండుగ సీజన్ సమీపిస్తున్న కొద్దీ దాని విక్రేత పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తూనే ఉందన్నారు. ఆరు నెలల్లో విక్రేతల లావాదేవీలలో 25 శాతం నుంచి 30 శాతం పెరుగుదల మరియు పండుగ కాలం (జూన్ - ఆగస్టు 2025) వరకు త్రైమాసికంలో 30 శాతం వరకు వృద్ధితో, ఫ్లిప్‌కార్ట్ మార్కెట్‌ప్లేస్ లక్షలాది ఎంఎస్ఎంఈలు, చేతివృత్తులవారు, వ్యవస్థాపకులు భారతదేశంలోనే అతిపెద్ద షాపింగ్ ఈవెంట్‌కు సిద్ధం కావడానికి వీలు కల్పిస్తోందన్నారు. ఏఐ ఆధారిత సాధనాలు, సరళీకృత విక్రేత పరిష్కారాలు, వేగవంతమైన సెటిల్మెంట్స్ , అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో స్థిరమైన విస్తరణ ద్వారా, విక్రేతలు బలమైన వృద్ధిని చూస్తున్నారన్నారు. రాబోయే పండుగ సీజన్‌ను ఒడిసిపట్టేందుకు మంచి స్థితిలో ఉన్నారు. ఈ వృద్ధిని శిక్షణా సెషన్‌లు, లైవ్ కామర్స్ వంటి కొత్త ఫార్మాట్‌లు, విస్తరించిన ఫుల్ ఫిల్మెంట్ మౌలిక సదుపాయాల ద్వారా బలోపేతం చేస్తున్నారని, పండుగ సమయంలో విక్రేతలు స్థిరంగా స్కేల్ చేయగలరని ఇది నిర్ధారిస్తుందని చెప్పారు. 2025 ప్రారంభం నుండి, లిస్టింగ్, నావిగేషన్, సెటిల్‌మెంట్‌లను సులభతరం చేయడానికి, ఫీజులను క్రమబద్ధీకరించడానికి, డెలివరీ వేగాన్ని మెరుగుపరచడానికి, పునరుద్ధరించబడిన సెల్లర్ హబ్, సెల్లర్ యాప్‌ను ఫ్లిప్‌కార్ట్ రూపొందించింది. ధర, ఎంపిక, రాబడి, మార్కెట్ ట్రెండ్‌లపై రియల్-టైమ్ విశ్లేషణల కోసం ఉచితంగా లభించే ఏఐ -ఆధారిత ఎన్ ఎక్స్ టి ఇన్‌సైట్స్ ప్లాట్‌ఫామ్‌ను ఎంపిక, వేగం , ఇన్వెంటరీపై జెన్ ఏఐ ఆధారిత సిఫార్సులను అందించే సివిపి (కస్టమర్ వాల్యూ ప్రొపోజిషన్) ఇన్‌సైట్‌లతో పాటు విక్రేతలు ఉపయోగిస్తున్నారని చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గురువారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సుని స్క్రీన్ ద్వారా ఏర్పాటు చేశారుఈ కార్యక్రమానికి నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు జోలికి వెళ్లి జీవితాన్ని పాడుచేసుకోవద్దు అని, మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మొదట్లో సరదాగా తీసుకునే మత్తపదార్థాలు క్రమేపీ నియంత్రణ కోల్పోయి మత్తుకు బానిసలు అవుతారనిన్నారు అని, చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటరని, క్యాన్సర్, మరియు ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అనంతరం విద్యార్థులచే మత్తు పదార్థాలకు వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞచేయించారుఅనంతరం నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోర్డినేటర్ నజ్మా మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోవడం జరుగుతుందనిన్నారు. అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడు లో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని ఈ లాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు మరియు యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన "బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగాసంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని అన్నారు అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి నరేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 23 నుండి ఫ్లిప్‌కార్ట్‌లో మోటరోలా స్మార్ట్‌ఫోన్‌ల ఆఫర్లు

విశాలాంధ్ర -విజయవాడ: మొబైల్ టెక్నాలజీలో ప్రపంచ అగ్రగామి, భారతదేశంలోని ప్రముఖ ఎఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, ఈరోజు ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ 2025 కోసం ఇంతకు ముందు ఎన్నడూ లే ని ధరలకు ప్రీమియం మరియు మిడ్-రేంజ్ స్మార్ట్‌ఫోన్ల అతిపెద్ద పండుగ శ్రేణిని ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత లీనమయ్యే ఎఐఆధారిత మోటోరోలా ఎడ్జ్ 60 ప్రో, 60 ఫ్యూజన్ బెస్ట్ సెల్లింగ్ మోటో %స్త్ర% సిరీస్ స్మార్ట్‌ఫోన్లు, ఐకానిక్ రాజర్ 60 సీరిస్ వరకు, మోటరోలా ఈ సీజన్‌లో పండుగ షాపింగ్‌ను పునర్నిర్వచించనుంది.

వాహనమిత్ర పెంచి డ్రైవర్లందరికీ వర్తింప చేయాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ట్రాన్సపోర్టు డ్రైవర్లు అందరికి వాహనమిత్రను వర్తింప చేస్తూ 30 వేలకు పెంచి అందించాలని,జీవో 21 రద్దు చేస్తూ ఆటో మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం రైల్వే స్టేషన్ నుండి ఆటోరాష్ట్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహాప్రదర్శన చేశారు. పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్న ఈ ర్యాలీ ఏలూరు లాకుల మీదుగా గాంధీనగర్ ధర్నా చౌక్ వరకు నిర్వహించారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లందరికీ వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని,300 యూనిట్లు, ఐటి రిటర్న్, చలానాలు వంటి నిబంధనలతో అనర్హులుగా ప్రకటించడం అన్యాయం మన్నారు. , డ్రైవింగ్ లైసెన్సే అర్హతగా ఉన్నవారందరికీ వాహనమిత్ర ఇవ్వాలి. అలాగే కర్ణాటక, కేరళ, తమిళనాడు తరహా సంక్షేమ బోర్డును వెంటనే ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలి. లేదంటే ఉధ్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కె. పోలారి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆటో మోటారు కార్మికులకు టీడీపీ, జనసేన కూటమి అనేక హామీలు ఇచ్చి ఎన్నికల మ్యానిఫ్యాస్టోలో కూడా పొందుపర్చి ప్రకటించి ఇప్పుడు అమలు చేయక పోవడం దుర్మార్గమన్నారు. ఉపాధి కల్పన పేరుతో కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న చంద్రబాబు స్వంతంగా ఉపాధి పొందుతున్న 6 లక్షల ఆటో కార్మికులలో కేవలం 2.75 లక్షల మందికి మాత్రమే వాహనమిత్ర అమలు చేయడం కార్మిక వర్గాన్ని మోసం చేయడమే అన్నారు. కానీ 15 నెలల తరువాత ఆటో కార్మికుల ఉపాధిని నష్టపర్చే ఫ్రీ. బస్సు పథకం ప్రవేశ పెట్టిన సందర్భంలో అయినా మాకిచ్చిన హామీల గూర్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ప్రకటన చేయలేదు. మా కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామన్నారు. కానీ ఆ కమిటీ కూడా ఆటోమోటారు కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు జరుపలేదన్నారు.కావున స్త్రీశక్తి ఫ్రీ బస్సు కారణంగా ఉపాధి దెబ్బ తింటున్న డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ఆటో, క్యాబ్ డ్రైవర్లు అందరికి వాహన మిత్ర పథకం వర్తింప చేయాలి. సహాయాన్ని 30 వేల రూపాయిలకు పెంచి అందించాలి. ఆదే విధంగా ఎన్నికల హామీలు అయిన పెనాల్టీల భారాలు తగ్గిస్తూ జీవో 21ని సవరించాలి. ముఖ్యంగా ఆటో మోటారు కార్మికులకు సాధికారిత సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, అధ్యక్షులు ఎన్ శివాజీ, ఐఎఫ్ఎయు ఆటో మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసరావు, కె.దుర్గారావు, ఇఫ్టూ నాయకులు ఎం.శంకర్, ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకులు ఎం. రామకృష్ణ, ఆర్.రవీంద్ర, ఆర్.వెంకటేష్, ఎఐసిసిటియు రాష్ట్ర నాయకులు ఉదయ్ కిరణ్, ఈశ్వరరావు, కిరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి డబ్ల్యుడి బ్లాక్ ఎస్ఎన్7100

విశాలాంధ్ర -విజయవాడః డబ్ల్యుడి బ్లాక్ ఎస్ఎన్7100 ఎంవిఎంఈ ఎస్ఎస్డీ, అనేది అన్ని గేమింగ్ అవసరాల కోసం నిర్మించిన స్కాన్ డిస్క్ డ్రైవ్. అది ఇప్పుడు ఇండియాలో అందుబాటులో ఉంది. అధిక పనితీరు కలిగిన డబ్ల్యుడి బ్లాక్ ఎస్ఎన్7100 ఎంవిఎంఈ ఎస్ఎస్డీ అనేది ముఖ్య స్ట్రీమ్ ఆటగాలకు బాగా సరిపోతుంది. అది రోజువారీ అధిక విజువల్, గేమింగ్ అనుభవాన్ని అందించడానికి సహాయం చేస్తుంది. అది ఫైల్ పరిమాణంతో పాటు పెరుగుతుంది. ఇది ఆధునిక టిఎస్‌ల సి3డి నాండ్‌తో తయారయింది.

నగరంలో విద్యుత్ కోత

విశాలాంధ్ర -విజయవాడ: నగరంలోని శుక్రవారం సీతారామపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి 10.00 గంటలు వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతోందని ఈఈ రవీంద్రబాబు తెలిపారు. చుట్టుగుంట రైవస్ కాలువగట్టు, సీతారామపురం కాలువగట్టు, లాల్బహదూర్ శాస్త్రి వీధి, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ రోడ్, కాకానినగర్, గీతామందిర్ రోడ్, మేదర బజారు, కోటిలింగాలవారివీధి, నెహ్రూ స్ట్రీట్, చాపరాల వారి వీధి, ఐనవోలు వారి వీధి, రామాకార్పొరేషన్ ఏరియా, శాతవాహన కాలేజీ వెనుకవైపు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఏరియా, విశాలాంధ్ర రోడ్ లలో విద్యుత్ సరఫరా ఆపబడునని విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

వృద్ధులకు భోజనం అభినందనీయమం : ఆర్‌కె

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మందపాడులోని నిరా శ్రయులు ఆశ్రమంలో శొంఠి పెద్దవెంకటేశ్వరావు 5వ వర్థం తి సందర్భంగా గురువారం ఆశ్రమంలో వృద్ధులకు భోజనం చేసిన శొంఠి కుటుంబ సభ్యులను బిజెపి పట్టణాధ్యక్షుడు డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) అభినందించారు. ఈ సందర్భంగా అర్‌కె మాట్లాడుతూ అన్నదానం పరబ్రహ్మ స్వరూపం అనే నినాదంతో శ్రీ హరిపురం గ్రామానికి చెందిన శొంటి పెదవెంకటేశ్వరావు వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పేదవారికి ఆహారం అందజేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు మీ పెళ్లి రోజులు, పుట్టినరోజులు, వివిధ శుభ కార్యక్రమాలకు మీ పేరు మీద ఆకలితో ఉన్న అనార్థులకు ఆహారం అందజేయాలని కోరారు.